విలేకరులు కావలెను

తెలంగాణ వాణి — TELANGANA VANI TELUGU DAILY — R N I No. APTEL/2012/53127

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143



TELANGANA VANI TELUGU DAILY — R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV — THE VOICE OF TELANGANA

ఎడిటర్ జెరిపోతుల సంపత్ 9912758107

సంపుటి: 16 | సంచిక : 137 | గురువారం 17. 9. 2026 | ఎడిటర్: జెరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00


## సీఎం చెప్పిన భూముల చిట్టాపై నిజాలు నిగ్గు తేలాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారు
- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత
- సిద్ధిపేట జిల్లాలో కవిత, ఆమె భర్త పేరు మీద 37.26 ఎకరాల భూమి ఉందని చెప్పార
- ముఖ్యమంత్రి ప్రకటనపై 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు.
- అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలి
- నిజాలు నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నా.
- నా కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు సీఎం చెప్పారు.
- ప్రభుత్వ నిబంధనలకు మించి ఒక్క గజం భూమి నాకు ఎక్కువగా ఉన్నా.



# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- 30 రోజుల్లో విచారణ జరపాలని శాసనసభ వేదికగా ఆదేశాలు
- 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందో? లేదో తేల్చాలి
- 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదు
- ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతాం
- "సిద్ధిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5ఎకరాలు ఉంది.
- కానీ, కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే"
- "రాష్ట్రంలో మొత్తం రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం జరిగింది.
- భూ కుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ) ఏర్పాటు చేస్తాం.
- మొత్తం భూ కుంభకోణంపై నెల రోజుల్లో నిగ్గు తేలుస్తాం.
- ఇప్పటి వరకు చెప్పింది ధరణి పార్ట్-1 మాత్రమే.
- త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం.
- బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతాం
- ఈ సారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలి.
- నా కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదు.
- టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతా.



హైదరాబాద్ తెలంగాణ వాణి) ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 30 రోజుల్లో విచారణ జరపాలని శాసనసభ వేదికగా తెలిపారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందో? లేదో తేల్చాలన్నారు. అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతామని ప్రకటించారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. "సిద్ధిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు, హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు, కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు, జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు, నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాల్లోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి. కేటీఆర్ జన్వాడ ఫామ్‌హౌస్‌పై నేనెందుకు బాంబులు వేస్తా? నేనేమైనా బిన్‌లాడెన్‌నా. స్టీఫెన్‌సన్‌కు ఎన్నికల ముందు నజరానా ఇచ్చారు. రూ.50 కోట్ల భూమిని రూ.1.53 కోట్లకే రెగ్యులరైజ్ చేశారు. గంగుల, ఎర్రబెల్లి, సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారు. జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చింది. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారు. ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27 ఎకరాలు ఉండాలి. కానీ, కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే" అని సీఎం వివరించారు.

"రాష్ట్రంలో మొత్తం రూ.లక్ష కోట్ల భూ కుంభకోణం జరిగింది. భూ కుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్ (ఎస్ఈటీ) ఏర్పాటు చేస్తాం. మొత్తం భూ కుంభకోణంపై నెల రోజుల్లో నిగ్గు తేలుస్తాం. ఇప్పటి వరకు చెప్పింది ధరణి పార్ట్-1 మాత్రమే. త్వరలోనే ధరణి పార్ట్-2 అక్రమాలు బయటపెడతాం. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతాం. ఈ సారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలి. నా కళ్లలోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదు. టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతా. ధరణిని అడ్డు పెట్టుకొని రూ.వేల కోట్లు దోచుకున్నారు. 22ఏ సమస్యల పరిష్కారానికి హైపవర్ ఆఫీసర్స్ కమిటీ ఏర్పాటు చేస్తాం. సమస్యల పరిష్కారానికి వారంలోపు సమగ్ర గైడ్‌లైన్స్ తీసుకొస్తాం. హెచ్‌ఎండీఏ, జీహెచ‌ఎంసీ, డీటీసీపీ లేఔట్ల దరఖాస్తులు పరిశీలిస్తాం. పెండింగ్‌లో ఉన్న, కొత్తగా వచ్చే దరఖాస్తులను పరిష్కరిస్తాం.

## ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలు బయటకు తీయాలి: కూనంనేని



హైదరాబాద్: కమ్యూనిస్టులు లేకుండా భూపోరాటాలు ఎక్కడా జరగలేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 1945 నుంచే కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని చెప్పారు. ధరణిలో జరిగిన తప్పిదాలతో ప్రజలకు చాలా నష్టం జరిగిందన్నారు. 3 లక్షల ఎకరాల ప్రైవేటు భూముల వివరాలను బయటకు తీయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 22ఏ నిషేధిత భూముల అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో కూనంనేని మాట్లాడారు.

హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, భూదాన్ భూముల వివరాలను వెల్లడించాలన్నారు. భూదాన్ భూములపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించే అంశాన్ని ఆలోచించాలని ప్రభుత్వానికి సూచించారు. నిజాం హయాంలో సర్ఫ్‌ఖాన్ పేరిట హైదరాబాద్‌లో ఉన్న భూములు ఇప్పుడు ఎక్కడని ప్రశ్నించారు. వాటిని బయటకు తీస్తే స్థలం లేని అందరికీ ఇవ్వొచ్చన్నారు. 22ఏ విషయంలో జరిగింది సాంకేతిక తప్పిదంగా భావిస్తున్నట్లు తెలిపారు. దీనిలో మంత్రులు, అధికారుల పాత్ర ఎంత ఉందో తేల్చాలన్నారు.

## తెలంగాణ శాసనసభ ఎల్లుండికి వాయిదా

తెలంగాణ శాసనసభ ఈనెల 18వ తేదీకి వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు శాసనసభ పునఃప్రారంభం కానున్నట్లు సభాపతి గడ్డం ప్రసాద్ ప్రకటించారు. సెప్టెంబర్ 17 పురస్కరించుకుని గురువారం శాసనసభకు సెలవు నేపథ్యంలో ఎల్లుండికి వాయిదా పడింది. ఇవాళ సభలో 22ఏ భూముల అంశంపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా మాట్లాడారు. సీఎం ప్రసంగం ముగిసిన అనంతరం స్పీకర్ సభను 15 నిమిషాల పాటు తాత్కాలికంగా వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత ఒక సభ్యుడికి మాట్లాడే అవకాశం కల్పించిన స్పీకర్, అనంతరం సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పొడిగింపుతో శుక్ర, శనివారాల్లో కూడా సభ సాగే అవకాశం ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం జరిగే సమావేశంలో రాష్ట్రంలో 'ఎల్ నినో' ప్రభావం, దాని పరిణామాలపై సభలో సుదీర్ఘ చర్చ జరగనున్నట్లు సమాచారం.

## ఇందిరమ్మ టవర్స్‌కు 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

నాలుగు నియోజకవర్గాల్లో దరఖాస్తుల గడువు పొడిగింపు

సెప్టెంబర్ 20 వరకు దరఖాస్తుల స్వీకరణ

వరుస సెలవులు, పండుగల దృష్ట్యా నిర్ణయం




హైదరాబాద్ తెలంగాణ వాణి) హైదరాబాద్ క్యూర్ పరిధిలోని ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 20, 2026 వరకు పొడిగించారు. రెండో శనివారం, ఆదివారం, పండుగలు మరియు ఇతర వరుస సెలవుల కారణంగా దరఖాస్తుల గడువును పొడిగించాలని వివిధ వర్గాల నుంచి విజ్ఞప్తులు అందాయి. వాటిని పరిశీలించిన అనంతరం దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 20 వరకు మిగతా 2లో..

## 17న ఉపరాష్ట్రపతి హైదరాబాద్ రాక

### సిపి రాధాకృష్ణన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



హైదరాబాద్ తెలంగాణ వాణి) సెప్టెంబర్ 17 వ తేదీన హైదరాబాద్ నగరంలో రాష్ట్ర ఉపరాష్ట్రపతి సి.పీ. రాధాకృష్ణన్ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉపరాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులు, పోలీసు అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, ఈనెల 17 న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ వస్తున్నారని మిగతా 2లో..

## EPF వేతన పరిమితి పెంపు

- కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది.
- ఉద్యోగుల భవిష్యనిధి గరిష్ఠ వేతన పరిమితి పెంపు ప్రతిపాదనకు ఆమోదం
- ప్రస్తుతం రూ.15వేలుగా ఉన్న పరిమితిని రూ.25వేలకు పెంచేందుకు క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.
- ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం
- ఈపీఎఫ్ వేతన పరిమితి పెంచాలని ఎప్పటి నుంచో డిమాండ్
- జీవన వ్యయం పెరిగినప్పటికీ దాదాపు 12 ఏళ్లుగా గరిష్ఠ వేతన పరిమితి పెరగలేదు.
- 2014లో చివరిసారిగా రూ.6500 నుంచి రూ.15వేలకు పెంచారు.
- దీంతో వేతన పరిమితి పెంచాలని కొన్నేళ్లుగా కార్మిక సంఘాలు డిమాండ్
- దీనిపై ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- వీరంతా ఈపీఎఫ్ఓ పరిధిలోకి వస్తారని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

## దానం నాగేందర్ అనర్హత కేసు హైకోర్టు తుది తీర్పు మళ్లీ వాయిదా




ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత అంశంపై తెలంగాణ హైకోర్టులో విచారణ ముగిసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. వాస్తవానికి ఇవాళ తుది తీర్పు వెల్లడించాల్సి ఉండగా ధర్మసనం శుక్రవారానికి వాయిదా వేసింది. అయితే, బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు డివిజన్ బెంచ్ పూర్తి వాదనలను విన్నది. కాగా, 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున ఖైరతాబాద్ స్థానం నుంచి విజయం సాధించిన దానం నాగేందర్, ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాకుండా, పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. స్పీకర్ ట్రిబ్యునల్ ముందు ఈ పిటిషన్లపై విచారణ జరగగా, దానం నాగేందర్ చట్టబద్ధంగా పార్టీ మారలేదంటూ స్పీకర్ కొట్టివేశారు.

## బోధించు ! సమీకరించు!! పోరాడు!!!

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆల్ ఇండియా అంబేద్కర్ ఆర్మీ ఆధ్వర్యంలో
- సెప్టెంబర్ 30వ తేదీ నుండి మొదలవనున్న

బహుజన రాజ్యాధికార సాధన మహాసంగ్రామ సభలు..

సెప్టెంబర్ 15(తెలంగాణ వాణి స్పెషల్ కరస్పాండెంట్ టి.ఎన్ రమేష్)

అదిలాబాదు నుండి మొదలు హైదరాబాద్ వరకు, కరీంనగర్ మొదలు, నగర్ కర్నూలు వరకు. పాలమూరు జిల్లా మొదలు, పటాన్చెరువు వరకు, నిజామాబాద్ జిల్లా నుండి, సిద్దిపేట వరకు. జహీరాబాద్ మొదలు, రాజధాని వరకు, 33 జిల్లాలలో, నిర్వహించ తలపెట్టిన ఈ మహత్కార్యానికి అధిక సంఖ్యలో బహుజన మేధావులు విద్యార్థులు యువత అందరూ ఏకమై కదిలి రావాలని ఆలిండియా అంబేద్కర్ ఆర్మీ పిలుపునిస్తూ పిలుస్తోంది.

రండి! కదలి రండి. !!

"బానిస సంకెళ్లను తెంచుకొని భారతదేశాన్ని పాలించేందుకై"

భవిష్యత్ తరాలు బానిసత్వం నుండి విముక్తి పొందేందుకై.

నేడు మనం తలపెట్టే ఈ మహోన్నత కార్యక్రమం,

రేపటి చరిత్ర పుటాల్లో నిలుస్తుందని ఆశిస్తూ చేయి చేయి కలిపి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అంతా ఒకటే!! మనమంతా ఒకటేనని రానున్నది బహుజన రాజ్యాధికారమేనని

చాటి చెప్పుదాం!!!

చేయి చేయి కలుపుదాం రాజ్యాధికారాన్ని కైవసం చేసుకుందాం!!!

బహుజన రాజ్యాధికార సంగ్రామ మహాసభలు. సెప్టెంబర్ 30 2026 నుండి, అదిలాబాద్ జిల్లా నుంచి మొదలవుతుంది.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యత వర్ధిల్లాలి.

భారతదేశంలో 85 శాతం ఉన్న బహుజనులమంతా రాజ్యాధికారం దిశగా అడుగులు వేయవలసి నా సందర్భం ఆసన్నమైనది.

మహాత్మ జ్యోతిరావు పూలే,

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్,

మాన్యశ్రీ కాన్షిరాం గార్ల రాజకీయ అధికార సాధికారతను సహకారం చేసుకోవడంలో మనమంతా ఒకటవుదాం.

, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ

వర్గాల ఉద్యోగులు, వ్యాపారులు, డాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలలో అత్యున్నత స్థానంలో ఉన్న ప్రతి ఒక్కరూ.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న,

బహుజన రాజ్యాధికార సంగ్రామ, మహా సభలను విజయవంతం చేయుట కొరకై మీ వంతుగా ప్రతి ఒక్కరూ సహకరించాలని మనవి.

నిమ్న జాతుల అభివృద్ధి కొరకై ఆర్థికంగా రిజర్వేషన్ల లబ్ధి పొందిన ప్రతి ఒక్కరు.

పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో, రాజ్యాధికారాన్ని కైవసం చేసుకునేందుకు, 85% ఉన్న మన వర్గాల ప్రజలను రాజకీయాల వైపు నడుపుటకై, వారిలో రాజకీయ చైతన్యం రగిలించి.

భారతదేశాన్ని పరిపాలించడమే మా అంతిమ లక్ష్యం అనే నినాదంతో ప్రజలను మేల్కొల్పేందుకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మహాత్మ జ్యోతిరావు పూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గార్ల ఆశయం మేరకు, ప్రజలలో రాజకీయ చైతన్యం కల్పించేందుకు పే బ్యాక్ టు సొసైటీ ద్వారా ప్రతి ఒక్కరు సహకరించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ ఆర్మీ తెలంగాణ రాష్ట్ర విభాగం కోరుచున్నది.



ఇట్లు మీ శ్రేయోభిలాషి
రమేష్ రావణ్
ఆల్ ఇండియా
అంబేద్కర్ ఆర్మీ
తెలంగాణ చీఫ్
జై భీమ్, జై భారత్, జై
తెలంగాణ

## విఘ్నాలు తొలిగించి విజయాలు కలిగించు లంబోధర

### భక్తుల పూజలందుకుంటున్న గణనాథుడు

**మణుగూరు సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**



మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల బాలల సదనం సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో కొలువైన గణాధిపతుడికి పంచమ నవరాత్రి మహోత్సవములు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మండపంలో కొలువైన గణనాథుడు అర్చకుల చేత నిత్య పూజలందు కుంటున్నాడు. మంగళవారం అర్చకులు చేత విఘ్నాధిపతికి అధిపతుడైన గణపతిని విఘ్నాలు తొలగించాలని, నిత్య పూజలో భాగంగా దేవరకొండ నరసింహాచారి, లలిత దంపతులు, కనుకు రమేష్, సంధ్యా దంపతులు పీటలమీద కూర్చొని, వివిధ రకాల పుష్పాలు, పంచామృతాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. పీటలపై కూర్చున్న దంపతులు లంబోధరుడుకు ఇష్టమైన ఉండ్రాళ్ళు, పాయసం, పులిహోర, సెనగలు వంటి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం తిలకించిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ వారు మాట్లాడుతూ.. వినాయకుడి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుని వేడుకున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ వరసిద్ధి వినాయక చవితిని మూడు రోజులు వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. ఆహ్లాదకరంగా భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గణనాథుని కృప ఎల్లవేళలా కమిటీ సభ్యులపై, ప్రజలందరిపై ఉండాలని తమకు సేవ చేసుకునే భాగ్యం ప్రతి సంవత్సరం కలగాలని ఏకదంతుడిని వేడుకున్నట్లు తెలిపారు. బుధవారం మండపంలో మహా అన్న ప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదంను స్వీకరించారు. నేడు జరిగే లడ్డు వేలంపాట అనంతరం గణేష్ నిమజ్జనానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఊరేగింపును విజయవంతం చేయాలని శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

## మోదీ పాలనలో భారత్ అభివృద్ధిలో ముందుకు సాగుతోంది : డాక్టర్ కే. లక్ష్మణ్




హిమాయత్ నగర్ : మోదీ పాలనలో భారత్ అభివృద్ధిలో ముందుకు సాగుతోందని బీజేపీ జాతీయ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే. లక్ష్మణ్ అన్నారు. త్వరలోనే ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి అక్టోబర్ 17 వరకు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు లక్ష్మణ్ పిలుపునిచ్చారు.

బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ గోల్కొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడారు. మోదీ 12 ఏళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, భూదందాలు, ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితమైందని లక్ష్మణ్ విమర్శించారు. మోదీ జన్మదిన వేడుకలను ప్రజలంతా పండుగ వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్ సింగ్ రాథోడ్, మాజీ కార్పొరేటర్లు శశి కళ, సురేఖ, నాయకులు సంజయ్, పురుషోత్తం జీ, కృష్ణ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఎవరు ?



: హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం సంగారెడ్డి బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగించాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులను కోరితే, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఎమ్మెల్యే పై ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు విజేందర్ రెడ్డి, శ్రీకాంత్ రామప్ప, రాజేందర్ రెడ్డిలు ఆరోపించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆరు నెలల్లో పూర్తి కావాల్సిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు రెండున్నరేళ్లు గడిచినా పూర్తి కాకపోవడంతో పాటు, నాణ్యతా లోపాలతో, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధికారులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయితే, దీనిని వక్రీకరించి ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లేలా మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ హయాంలో సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి నుంచి పాత బస్టాండ్ వరకు రహదారిని విస్తరించి అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రస్తుతం తానే నిధులు తీసుకొచ్చానని చెబుతూనే 50 అడుగుల రోడ్డు సరిపోతుందని జగ్గారెడ్డి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవైపు అభివృద్ధిని అడ్డుకుంటూ, మరోవైపు ఎమ్మెల్యే పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో ప్రతి వార్డుకు రూ.8 కోట్ల నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చి చైర్మన్ పదవిని గెలుచుకున్న తర్వాత మాట మార్చారని జగ్గారెడ్డి పై ఆరోపణలు చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో ఏ పార్టీకి చెందిన కౌన్సిలర్ అయినా అభివృద్ధి పనులకు సహకరించామని, ప్రస్తుతం ప్రతిపక్ష కౌన్సిలర్లకు నిధులు కేటాయించకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆరోగ్యం బాగోలేకపోయినా నిరంతరం ప్రజల కోసం పనిచేసే వ్యక్తి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అని వారు కొనియాడారు. చిరు వ్యాపారులకు తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డుకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించామని, ఆ పనులను పూర్తి చేసి చిరు వ్యాపారులు గౌరవంగా వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో సంగారెడ్డి ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. సీఎం వస్తే నిధులు వస్తాయని ప్రజలు ఆశించినప్పటికీ, ఒక్క రూపాయి కూడా నిధులు రాలేదని ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలా నిర్వహించారని విమర్శించారు. తమ హయాంలో అభివృద్ధి చేసిన పార్కుకు అవార్డు వచ్చిందని తెలిపారు. ముగ్గురు ముఖ్యమంత్రులు సందర్శించిన రాజీవ్ పార్కును సైతం ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి చేయలేకపోయిందని ఆరోపించారు. ఐబీ వద్ద విగ్రహాల ఏర్పాటుకు హడావుడిగా సీఎం వస్తున్నారని చెప్పి ఐబీ గోడను కూల్చి, కొంతవరకు బీటీ రోడ్డు వేసి పనులను నిలిపివేశారని ఆరోపించారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని, నిబంధనల ప్రకారం బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు చేపడితే సంగారెడ్డి ప్రజలకు మేలు జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బుచ్చిరెడ్డి, లాడే, మల్లేశం, మనీష్ గౌడ్, శ్రీకాంత్, వాజిద్, మజీద్, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## అణచివేతతో కూడిన క్రూరపు పాలన నుంచి స్వేచ్ఛా ప్రభాతం వరకు: 1948 తెలంగాణ విముక్తి గాథ

**1947 ఆగస్టు 15న భారతావని స్వేచ్ఛా వాయువులు పీలుస్తోంది. బ్రిటిష్** దాస్య శృంఖలాలకు, బానిస సంకెళ్లకు స్వస్తి చెప్పి దేశమంతా ఎర్రకోటపై త్రివర్ణ పతాకం ఎగిరి స్వేచ్ఛాయుత భారత్‌లో ప్రజలు ఆనందోత్సాహాలతో మురిసిపోతుంటే, దక్కన్‌లో హైదరాబాద్ సంస్థానంలో నిజాం పరిపాలనలో మాత్రం అరాచకం, అణచివేత, దోపిడీ, దౌర్జన్యాలు, హత్యలు, ఆకృత్యాలు విలయతాండవం చేస్తున్నాయి. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఐక్య భారత్‌లో కలవడానికి నిరాకరించి, హైదరాబాద్ సంస్థానాన్ని స్వతంత్ర రాజ్యంగా మార్చేందుకు పన్నుతున్న కుట్రలు ప్రజల పాలిట శాపమయ్యాయి. 13 నెలల పాటు సాగిన ఈ మారణకాండ, అణచివేత, రజాకార్ల అడ్డు అదుపులేని అరాచకాలు ప్రజలలో తీవ్ర పోరాటాలను, ఉద్యమాలను, తిరుగుబాటును రేకెత్తించాయి. ఒకవైపు రజాకార్ల దౌర్జన్యాలు, మరొకవైపు ప్రజా పోరాటాలు హైదరాబాద్ సంస్థానాన్ని హోరెత్తించాయి.

**రజాకార్ల నరమేధం మానవత్వాన్ని తుడిచిపెట్టుకుపోయిన ఘడియలు అవి.**

నైజాంకు అండగా నిలిచిన మజ్లిస్ ఇత్తిహాదుల్ ముస్లిమీన్ (MIM) అధినేత కాసిం రజ్వీ "హిందూ మహాసముద్రంలో నిజాం జెండా ఎగురవేస్తాం" అని బహిరంగంగా ప్రకటించాడు. అతని నేతృత్వంలో దాదాపు లక్షన్నర మందితో తయారైన 'రజాకార్లు' (ప్రైవేట్ సైన్యం) గ్రామాలపై విరుచుకుపడ్డారు.

జనగామ సమీపంలోని బైరాన్ పల్లి గ్రామం రజాకార్ల దాడులను ఎదుర్కొనేందుకు మట్టి కోట నిర్మించుకుంది. మూడుసార్లు విఫలమైన రజాకార్లు, నిజాం సైన్యం సహాయంతో గ్రామాన్ని ముట్టడించి, అమాయక పురుషులను వరుసగా నిలబెట్టి కాల్చి చంపారు. ఊరిలోని నూతిలో శవాలను పడేశారు. 96 మందిని అత్యంత కిరాతకంగా చంపేశారు.

గుండ్రంపల్లి గ్రామంలో రజాకార్లు జరిపిన దాడిలో పదుల సంఖ్యలో ప్రజలను సజీవంగా బావిలో పడేసి రాళ్లతో కొట్టి చంపారు.

మహిళలపై అఘాయిత్యాలు, పన్నుల దోపిడీకి లెక్కే లేదు. 'లేవీ' పేరుతో రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తాన్ని గుంజుకోవడం, ఎదురుతిరిగిన వారి ఇళ్లను తగలేయడం నిత్యకృత్యమైంది. సిర్నాపల్లి, కడియం వంటి ప్రాంతాల్లో స్త్రీల మానప్రాణాలను బలితీసుకున్నారు.

కామారెడ్డి, పరిగి, పతంగి, ముత్యంపేట వంటి అనేక గ్రామాల్లో రజాకార్లు జరిపిన లూటీలు అణచివేతకు పరాకాష్ఠ. బతుకమ్మ ఆడుకుంటున్న మహిళలను నగ్నంగా ఊరేగించడం, మానభంగాలు చేయడం వంటి దారుణాలకు ఒడిగట్టారు. గ్రామాలకు గ్రామాలనే తగలబెట్టి, రైతుల పంటలను నాశనం చేశారు. 'కలం పట్టిన చేతిని నరుకుతాం' అని హెచ్చరిస్తూ పాఠశాలలను, గ్రంథాలయాలను, దేవాలయాలను ధ్వంసం చేశారు. లొంగని అమాయకులను, దేశభక్తులను చెట్లకు వేలాడదీసి ఊరి ప్రజల ముందే బహిరంగంగా కాల్చిచంపేవారు. గర్భిణులని కూడా చూడకుండా కడుపుపై తన్ని ప్రాణాలు తీసిన సంఘటనలు తెలంగాణ వ్యాప్తంగా రజాకార్ల నరరూప రాక్షసత్వాన్ని చాటిచెప్పాయి.

**జ్వలించిన జనగాథ: అణచివేతపై ప్రజాగర్జన;**

రజాకార్ల దౌర్జన్యాలు హెచ్చుమీరుతున్న కొద్దీ తెలంగాణ పల్లెపల్లెనా తిరుగుబాటు జ్వాలలు విరుచుకుపడ్డాయి. వివిధ పోరాట వేదికలు ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని రగిలించాయి.

రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మగ్దూం మొహియుద్దీన్ నాయకత్వంలో ఆంధ్ర మహాసభ ప్రజా చైతన్యం తెచ్చింది. విసునూరు దొర జగన్నాథరెడ్డి అక్రమాలను ఎదుర్కొన్న చాకలి ఐలమ్మ భూపోరాటం ఉద్యమానికి నిప్పురవ్వ అయింది. 1946 జూలై 4న దొడ్డి కొమురయ్య రజాకార్ల గుండ్లకు ఎదురొడ్డి అమరుడవడంతో తెలంగాణ సాయుధ పోరాటం ఉవ్వెత్తున లేచింది. గుళ్ళెళ్ళు, కంకర్ కర్రలతో మొదలైన పోరాటం తుపాకులు పట్టే స్థాయికి చేరింది. స్వామి రామానంద తీర్థ నేతృత్వంలోని హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ విలీనం కోరుతూ సత్యాగ్రహం చేపట్టింది. కె.వి. రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, పి.వి. నరసింహారావు లాంటి నేతలు నగరాల్లో ప్రజలను ఐక్యం చేశారు. ఆర్యసమాజ్ నేతలు పండిత్ నరేంద్రజీ, వందేమాతరం రామచంద్రరావు సాంస్కృతిక చైతన్యాన్ని రగిలించారు. ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో 'వందేమాతరం' గీతాన్ని నిషేధిస్తే విద్యార్థులు ఉద్యమించి కళాశాలలను బహిష్కరించారు.

నిజాం రజాకార్ల అరాచకాలను పత్రిక ద్వారా ఎండగట్టిన ధీరోదాత్త పాత్రికేయుడు షోయబుల్లా ఖాన్‌ను హైదరాబాద్ నడిబొడ్డున రజాకార్లు దారుణంగా హత్య చేశారు.

హైదరాబాద్ భారత్‌లో విలీనం కాకపోతే దేశ సమగ్రతకే పెను ముప్పు అని గ్రహించిన నాటి హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ "హైదరాబాద్ భారతదేశం కడుపులో ఉన్న క్యాన్సర్ కణితి, దాన్ని శస్త్రచికిత్స చేసి తొలగించాల్సిందే" అని తేల్చిచెప్పారు.

నిజాం నవాబు భారత ప్రభుత్వంతో చేసుకున్న యథాతథ ఒప్పందాన్ని ఉల్లంఘించి, పాకిస్తాన్‌తో రహస్యంగా 20 కోట్ల రూపాయల రుణం ఇచ్చిపుచ్చుకోవడం, ఆయుధాలు కొనుగోలు చేయడం కేంద్రానికి మింగుడుపడలేదు. గోవాలోని పోర్చుగీసు పాలక యంత్రాంగం ద్వారా విదేశీ ఆయుధాలు దిగుమతి చేసుకోవడానికి నిజాం కుట్రలు పన్నారు. కాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు సరిహద్దు జిల్లాలలోని (కృష్ణా, గుంటూరు, కర్నూలు సరిహద్దుల) భూభాగాలపై సైతం దాడులు చేసి రైలు ప్రమాదాలకు, లూటీలకు పాల్పడ్డారు. భారతదేశ గుండెకాయ లాంటి హైదరాబాద్‌లో స్వతంత్ర రాజ్యం ఏర్పడితే దేశ భద్రతకు తీవ్ర ముప్పు అని గ్రహించిన పటేల్, దౌత్యపరమైన శాంతి చర్చలకు కాలం చెల్లిపోయిందని స్పష్టం చేశారు. నెహ్రూ ఇతర అంతర్జాతీయ పర్యవసానాల గురించి ఆలోచిస్తున్నప్పటికీ, పటేల్ దృఢ సంకల్పంతో సైనిక చర్య ప్రణాళికను ఆమోదించారు.

1948 సెప్టెంబర్ 13న మేజర్ జనరల్ జె.ఎన్. చౌదరి నేతృత్వంలో 'ఆపరేషన్ పోలో' (సైనిక చర్య) మొదలైంది. ఐదు రోజుల్లోనే నిజాం సైన్యం, రజాకార్ల బలం తునాతునకలైంది. 1948 సెప్టెంబర్ 17న ఏడో నవాబు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రేడియో ద్వారా లొంగుబాటు ప్రకటన చేశారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం చెందింది.

హైదరాబాద్ సంస్థాన విలీన చరిత్ర కేవలం ఒక భూభాగంలో పాలనా మార్పు మాత్రమే కాదు; అది స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, హక్కుల కోసం ఒక జాతి చేసిన సుదీర్ఘ వీరపోరాటం. అమాయక పల్లెజనం తమ రక్తంతో రాసిన ఈ విముక్తి గాథ నేటి తరానికి ఎన్నో పాఠాలను నేర్పుతోంది. మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం ఊరికే రాలేదు. వేలాది మంది అమరుల త్యాగాలు, దొడ్డి కొమురయ్య, ఐలమ్మ, షోయబుల్లా ఖాన్ వంటి వీరుల ఆత్మబలిదానాల పునాదులపై మన వర్తమానం నిలబడింది. ఏ రకమైన అణచివేతనైనా సరే ధీటుగా ఎదుర్కొనే ఆత్మగౌరవాన్ని, దేశ ఐక్యతను కాపాడుకునే బాధ్యతను ఈ ఉద్యమ చరిత్ర నేటి యువతకు పిలుపునిస్తోంది. సెప్టెంబర్ 17న భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానం విలీనమైన సందర్భంగా ఈ ప్రత్యేక కథనం.

వ్యాసకర్త
G Sridevi
8309415303

## సెప్టెంబర్ 17: విమోచనమా.. విలీనమా.. విద్రోహమా?

### చరిత్రను రాజకీయ కళ్లద్దాలతో కాకుండా..

### వాస్తవాల కోణంలో చూడాల్సిన సమయం



సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన తేదీ. 1948లో హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలన ముగిసి, హైదరాబాద్ భారత యూనియన్‌లో చేరిన రోజు ఇదే. అయితే ఈ రోజును ఏ పేరుతో గుర్తించాలన్న అంశంపై దశాబ్దాలుగా భిన్నాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. కొందరు విమోచన దినంగా, మరికొందరు విలీన దినంగా, ఇంకొందరు నాటి సాయుధ రైతాంగ పోరాటం, ప్రజా తిరుగుబాటు కోణంలో ప్రత్యేకంగా గుర్తించాలని కోరుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం 2024లో సెప్టెంబర్ 17ను ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది.

**1948 సెప్టెంబర్ 17న ఏం జరిగింది?**

1947లో భారత్ స్వాతంత్ర్యం పొందినప్పటికీ హైదరాబాద్ సంస్థానం వెంటనే భారత యూనియన్‌లో చేరలేదు. నిజాం పాలన కొనసాగింది. ఇదే సమయంలో సంస్థానంలో ప్రజాస్వామ్య హక్కులు, సామాజిక న్యాయం, భూసంబంధిత సమస్యలపై వివిధ ఉద్యమాలు సాగాయి. రజాకార్ల హింస, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా ప్రతిఘటన తీవ్రరూపం దాల్చింది. భారత ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనిక చర్య చేపట్టింది. 1948 సెప్టెంబర్ 17న నిజాం సైన్యం లొంగిపోవడంతో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయింది. తెలంగాణ ప్రభుత్వ విద్యా పాఠ్యాంశాలు కూడా హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో సెప్టెంబర్ 17, 1948న విలీనం అయిందని పేర్కొంటున్నాయి.

**'విమోచన దినం' ఎందుకు?**

కేంద్ర ప్రభుత్వం 2022లో సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విమోచన దినం గా ఏడాది పాటు స్మరించేందుకు నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ వివరణ ప్రకారం నిజాం పాలన నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించి, భారత యూనియన్‌లో చేరిన సందర్భాన్ని ఈ పేరుతో గుర్తిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు కూడా సెప్టెంబర్ 17ను అధికారికంగా విమోచన దినంగా నిర్వహిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ దృక్పథంలో సెప్టెంబర్ 17 అంటే నిరంకుశ పాలనకు ముగింపు, ప్రజలకు విముక్తి, భారతదేశంలో విలీనం అనే మూడు అంశాలు ప్రధానంగా నిలుస్తాయి.

**'విలీన దినం' ఎందుకు?**

చారిత్రకంగా చూస్తే సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరిన అంశం కూడా స్పష్టమైన వాస్తవం. అందువల్ల ఈ రోజును హైదరాబాద్ భారతదేశంలో విలీనమైన రోజుగా గుర్తించే వర్గాలు 'విలీన దినం' అనే పదాన్ని ఉపయోగిస్తాయి. అయితే 'విలీనం' అనే పదం కేవలం పరిపాలనా పరిణామాన్ని మాత్రమే ముందుకు తెస్తుందని, ప్రజల పోరాటం, త్యాగాలు, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాన్ని కూడా గుర్తించాల్సిన అవసరం ఉందని మరో వాదన ఉంది.

**'విద్రోహ దినం' అనే కోణం**

'విద్రోహ దినం' అనే పదం ప్రధానంగా ప్రజలు రాచరిక, నిరంకుశ వ్యవస్థకు వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు, రైతాంగ పోరాటం వంటి అంశాలను ముందుకు తెచ్చే భావన. అయితే ఇది సెప్టెంబర్ 17కు విస్తృతంగా అంగీకరించబడిన అధికారిక పేరు కాదు. కాబట్టి 'విద్రోహ దినం'ను అధికారిక చారిత్రక పేరుగా కాకుండా ప్రజా పోరాటాన్ని వివరించే ఒక రాజకీయ--చారిత్రక వ్యాఖ్యానంగా చూడటం సముచితం.

**మూడు పేర్ల వెనుక మూడు కోణాలు**

విమోచన దినం --- నిజాం పాలన నుంచి విముక్తి, భారత యూనియన్‌లో చేరిక.

విలీన దినం --- హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో అధికారికంగా చేరిన చారిత్రక పరిణామం.

విద్రోహ దినం --- రాచరిక, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు, రైతులు సాగించిన పోరాటాన్ని ప్రధానంగా గుర్తించే కోణం.

**అయితే ప్రాధాన్యత దేనికి?**

ఒకే పదాన్ని ఎంచుకుని మిగిలిన చారిత్రక కోణాలను పక్కన పెట్టడం కంటే సెప్టెంబర్ 17న జరిగిన మొత్తం చారిత్రక పరిణామాన్ని సమగ్రంగా గుర్తించడం చరిత్రను అర్థం చేసుకునే మార్గం. అధికారికంగా తెలంగాణ ప్రభుత్వం 2024 నుంచి ఈ రోజును ప్రజా పాలన దినోత్సవం గా నిర్వహిస్తోంది. ప్రభుత్వం చెప్పిన కారణం కూడా ఇదే---'విమోచన' లేదా 'విలీనం' అనే పేర్లపై ఉన్న భిన్నాభిప్రాయాలకు అతీతంగా ప్రజల చరిత్ర, ప్రజాస్వామ్య పాలన ప్రారంభమైన సందర్భాన్ని గుర్తించడం. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వం 'హైదరాబాద్ విమోచన దినం' అనే పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తోంది.

**చరిత్రకు రాజకీయ రంగు వద్దు**

సెప్టెంబర్ 17 చరిత్రలో నిజాం పాలన, రజాకార్ల హింస, ప్రజా పోరాటాలు, రైతాంగ ఉద్యమం, భారత ప్రభుత్వ చర్య, ఆపరేషన్ పోలో, హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో చేరడం---ఇవన్నీ పరస్పరం సంబంధం ఉన్న అంశాలు. అందువల్ల 'విమోచనం'లోని విముక్తి భావనను, 'విలీనం'లోని చారిత్రక వాస్తవాన్ని, 'విద్రోహం'లోని ప్రజా పోరాట కోణాన్ని విడదీయకుండా చరిత్రను సమగ్రంగా ప్రజలకు వివరించడం అవసరం. సెప్టెంబర్ 17 ఒక పేరు కోసం పోరాడే రోజు కాదు.. చరిత్రను గుర్తుచేసుకునే రోజు.

అమరుల త్యాగాలను స్మరించుకుంటూ.. చారిత్రక వాస్తవాలను భావితరాలకు అందించాల్సిన రోజు.

వ్యాసకర్త
అఫ్జల్ పఠాన్
970324713

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

హిమాయత్‌నగర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేలాది మంది ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక కార్యదర్శి ఈ. అశ్వత్థామరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనానికి ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏ.పీ. మిథున్‌రెడ్డి, ప్రముఖ గాయకుడు నల్గొండ గద్దర్, ఐఎన్‌టీయూసీ సంయుక్త కార్యదర్శి ఇందిరారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు హాజరయ్యారు. తెలంగాణ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్‌లో విలీనమైందని, వర్కర్స్ యూనియన్ నూతన అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డిని ఈ సమ్మేళనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అశ్వత్థామరెడ్డి ప్రకటించారు.

ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యల పై తనకు మొదటి నుంచే అవగాహన ఉందన్నారు. 2019లో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసిన సమయంలో అశ్వత్థామరెడ్డితో కలిసి తాను అనేక డిపోలను సందర్శించి కార్మికులకు అండగా నిలిచానని మంత్రి తెలిపారు. పలు డిపోలకు వెళ్లి కార్మికులను కలసి వారి సమస్యలను తెలుసుకున్నామని చెప్పారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనూ సమ్మెలో ఉన్న కార్మికులను కలిసి వారికి మద్దతు తెలిపినట్లు గుర్తుచేశారు. కార్మికులకు న్యాయం జరిగితే ఉత్పాదకత పెరుగుతుందని, సంస్థలు కూడా మెరుగ్గా పనిచేస్తాయని మంత్రి అన్నారు.

కార్మికుల సంక్షేమం, సంస్థల అభివృద్ధి రెండూ సమాంతరంగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీని బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. 4,584 కొత్త ఉద్యోగాల భర్తీ జరిగిందని చెప్పారు. కారుణ్య నియామకాల ద్వారా కూడా 2 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే మహాలక్ష్మి పథకం విజయవంతంగా అమలు కావడంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని మంత్రి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ఈ పథకం ప్రయోజనం అందుతోందని తెలిపారు. కార్మికులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటిని సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, తాను కలిసి ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా నష్టపోయారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా ఉందని తెలిపారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ జలమండలిలో మొగుళ్ల రాజిరెడ్డి అన్ని విభాగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ఫలితంగా జలమండలి ఉద్యోగులు మొగుళ్ల రాజిరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారని గుర్తుచేశారు. త్వరలో జరిగే ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో నూతన అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ అభ్యర్థి ఈ. అశ్వత్థామరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి ఆర్టీసీ కార్మికుల సమస్యలను తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (ఏ-4522) విజయానికి ప్రతి ఒక్క ఆర్టీసీ కార్మికుడు కృషి చేయాలని కోరారు.

## ప్రజా పాలన దినోత్సవ వేడుకల నిర్వహణకు అధికారుల ఏర్పాట్లు



**నిర్మల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి)**

రేపటి రోజున జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించబోయే సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు అధికారులు విస్తృత ఏర్పాటు చేస్తున్నారు. ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వ విప్ వేముల వీరేశం పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ఆయన జాతీయ జెండాను ఎగురవేసి, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొంటారు.

## ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకుల పాత్ర కీలకం




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. కలెక్టరేట్‌లో డీఎల్ఆర్సీ, డీసీసీ సమావేశం నిర్వహించి బ్యాంకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైతులకు పంట రుణాలు త్వరితగతిన మంజూరు చేయాలని, డ్రోన్ వ్యవసాయానికి రుణాలు ప్రోత్సహించాలని, మహిళా సంఘాలకు వినూత్న స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. నిష్క్రియంగా ఉన్న పీఎం జన్ధన్ ఖాతాలను యాక్టివ్ చేయడంతో పాటు పెండింగ్ రుణ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం ఉత్పల్ కుమార్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ ఎస్. రాములు, జడ్పీ సీఈఓ రవి, ఈడీ మనోహర్, ఆర్‌బీఐ ఏజీఎం రాములు తదితర బ్యాంకు, శాఖల అధికారులు పాల్గొన్నారు

## టీబీ నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి




**నిర్మల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి):**

జిల్లాను టీబీ రహితంగా మార్చేందుకు వైద్య ఆరోగ్య శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో రాథోడ్ రమేష్ సూచించారు. కలెక్టరేట్‌లో టీబీ ముక్త భారత్ అభియాన్‌పై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి పరీక్షలు చేయించాలని, టీబీ నిర్ధారణైన వారికి ఉచిత చికిత్స, పోషక సహాయం అందేలా చూడాలని సూచించారు. టీబీపై అపోహలు, వివక్ష తొలగించేందుకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రాజేందర్ మాట్లాడుతూ నిక్షయ్ మిత్రల ద్వారా టీబీ బాధితులకు పోషకాహారం, సామాజిక సహకారం అందేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కుందారం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



**మంచిర్యాల, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**

కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, టీకాల నిల్వలు, మాతా శిశు సంరక్షణ, క్షయ నియంత్రణ కార్యక్రమాలను పరిశీలించారు. గర్భిణుల వంద శాతం నమోదు, టీకాల పంపిణీ, అత్యవసర మందుల లభ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వైద్య సిబ్బంది సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, హెచ్‌ఈఓ రాంబాబు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరుస ప్రమాదాలతో గని కార్మికుల్లో ఆందోళన

**మంచిర్యాల, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**



మందమర్రి ఏరియా సింగరేణి కేకే-5 గనిలో గాలి ఒత్తిడి కారణంగా ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. గనిలోని మూడో సీము, 16వ స్థాయిలో పైకప్పు ఒక్కసారిగా కూలడంతో ఏర్పడిన గాలి ఒత్తిడికి 12వ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న రామిల్ల తిరుపతి, అవునూరి శశికుమార్, ఎ. రాజశేఖర్ ఎగిరిపడి గాయపడ్డారు. తోటి కార్మికులు వారిని రామకృష్ణాపూర్ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. దే గనిలో గతంలో పైకప్పు కూలి కార్మికుడు గాయపడిన ఘటన నేపథ్యంలో మరో ప్రమాదం జరగడంతో కార్మికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గనుల్లో భద్రతా చర్యలను కఠినంగా అమలు చేయాలని, ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపి నివారణ చర్యలు చేపట్టాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సమ్మె విరమించకుంటే చర్యలు

- రైతులు ఆందోళన చెందవద్దు.
- ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది.
- రైస్ మిల్లర్స్ ను హెచ్చరించిన డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి.

**నిజామాబాద్ సిటీ సెప్టెంబర్ 16 ( తెలంగాణ వాణి)**



రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేసే విధంగా సమ్మె చేపట్టిన రైస్ మిల్లర్ లు ఖబర్దార్ అంటూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నగేష్ రెడ్డి హెచ్చరించారు. వెంటనే తమ సమ్మెను విరమించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథిగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఇబ్బందులకు గురి చేసే విధంగా రైస్ మిల్లర్లు సమ్మె చేపట్టడం సరైనది కాదని ప్రభుత్వానికి కట్టవలసిన బకాయిలు తమ మీదనే ఉంచుకొని ప్రభుత్వానికి బకాయిలు కట్టకపోవడం సరైంది కాదని అన్నారు. ఈనెల 31వ తేదీలోపు రైస్ మిల్లర్లు తమ సమ్మెను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులు పార్టీలకతీతంగా తమ రైస్ మిల్లర్ల ఎదుట ధర్నాలకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రభుత్వం తీవ్రమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందన్నారు. జిల్లాలోని రైతులు ఎలాంటి ఆందోళన గురికా వద్దని ఖరీఫ్ సీజన్లో పండించిన ధాన్యాన్ని ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి 400 కోట్లు బకాయిలు పద్దారని వాటిని యుద్ద ప్రాతిపదికన చెల్లించేందుకు ప్రభుత్వ విసులుబాటు కలిపిస్తుందన్నారు రైస్ మిల్లర్లు దాని గురించి ఆలోచించకుండా ధర్నాలు సమ్మెలు చేపట్టడం సరైనది కాదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా రైస్ మిల్రర్లు దోచుకున్నారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని విషయాలు క్షుణ్ణంగా పరిశీలించి రైతులకు మేలు జరిగే విధంగా కార్యచరణ రూపొందిస్తున్నారని అన్నారు బకాయిలు చెల్లించని ప్రతి రైస్ మిల్లర్ ప్రభుత్వం వెసులుబాటు కలిగించిన విధంగా బకాయిలు చెల్లించాలని తెలిపారు మీడియా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్, మోహన్ రెడ్డి, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన సింగరేణి కార్మికులకు పట్టాలు అందించాలి

- జీవో 76తో ఏర్పడిన అడ్డంకులను తొలగించాలి
- మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**




సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం చూపి, అర్హులైన కార్మికులకు ఇళ్ల పట్టాలు అందేలా జీవో నెం. 76ను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ రాష్ట్ర భూగర్భ గనుల, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలకు సొంత ఇంటి స్థలం కల్పించడం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గతంలో కాకా వెంకటస్వామి హయాంలో గోదావరిఖని ప్రాంతంలో సుమారు 29 వేల మంది సింగరేణి కార్మికులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. ఆ సమయంలో పట్టాలు పొందని మరికొందరు అర్హులైన కార్మికులు ప్రస్తుతం కూడా పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్మికులు ఏళ్ల తరబడి పనిచేసిన ప్రాంతాల్లోనే నివాస స్థలాలకు సంబంధించిన హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే ప్రస్తుతం జీవో నెం.76 కారణంగా అర్హులైన సింగరేణి కార్మికులకు ఇళ్ల పట్టాల మంజూరులో జాప్యం జరుగుతోందని మంత్రి తెలిపారు. ఈ జీవోను ఎత్తివేసి కార్మికులకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రివర్గం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినట్లు వివరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకుని జీవో నెం. 76ను ఎత్తివేస్తే వేలాది మంది సింగరేణి కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆకాంక్షించారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినికి ఎంబీబీఎస్ మెడికల్ సీటు

**నిజామాబాద్ సెప్టెంబర్16: (తెలంగాణ వాణి ప్రతినిధి)**




నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపిసి చదివిన విద్యార్థిని మదీహ షేవార్ కు నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. 2024బ26 విద్య సంవత్సరంలో నిజామాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బైపిసి ఇంగ్లీష్ మీడియం లో చదివిన మదీహ షేవార్ ప్రతిభా వంతురాలని కళాశాల ప్రిన్సిపాల్ గంధం బుద్ధిరాజ్ అన్నారు. తమ కళాశాల నుండి నీట్ పరీక్షకు హాజరైన మధిహ కు రాష్ట్ర స్థాయిలో 2,959 ర్యాంక్ సాధించిందని, జాతీయ స్థాయిలో 1,57,807 ర్యాంక్ సాధించిందని ప్రిన్సిపల్ తెలియజేశారు. మదిహను ఆదర్శంగా తీసుకొని కళాశాల విద్యార్థినిలు బాగా చదువుతూ మంచి ర్యాంకులు సాధించి భవిష్యత్తులో స్థిరపడాలని ఉద్బోధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల లో అధ్యాపక, అధ్యాపకేతర బృందం తరపున ప్రిన్సిపాల్ మధిహ షేవార్ ను శాలువ తో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. భవిష్యత్ లో మంచి డాక్టర్ గా వచ్చి నిజామాబాద్ ప్రజలకు వైద్య సేవలను అందించాలని ప్రిన్సిపల్ గంధం బుద్ధిరాజ్ ఆకాంక్షించారు. విద్యార్థిని మధిహ షేవార్మాట్లాడుతూ తన అభ్యున్నతికి కృషి చేసిన ప్రిన్సిపాల్ కు, అధ్యాపక బృందం మంజులవాని (కెమిస్ట్రీ) , మురళి (ఫిజిక్స్) , అర్చన (జువలాజి), అర్చన(బోటనీ) కృతజ్ఞతలు తెలిపారు. తనను ప్రోత్సహించిన అధ్యాపకులు మహమ్మద్ ఫరీస్ ఉద్దీన్(కెమిస్ట్రీ), షాజీయా బాదర్ (ఫిజిక్స్), అనిస్ ఫాతిమ(జూలజి), సురయా ఆఫ్రిన్ (బోటనీ), ఫహీం ఉద్దీన్ (ఎకనామిక్స్) లకు కృతజ్ఞతలు తెలిపారు. మధిహ తండ్రి ఇనాయత్ అలీ మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకుల బృందం బాగా కృషి చేసి బోధించడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షులు నర్సయ్య, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



## కళాభారతి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్

**నిజామాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ స్థలంలో నిర్మిస్తున్న కళాభారతి ఆడిటోరియం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం పనులను పరిశీలించిన ఆయన, 1,400 మంది కూర్చునే సామర్థ్యంతో నిర్మిస్తున్న ఆడిటోరియం, బ్యాంకెట్ హాళ్లు, ఆర్ట్ గ్యాలరీ తదితర పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు స్థలాల పరిశీలన

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వసతి గృహాల నిర్మాణానికి ఎంపిక చేసిన గుండారం, నాగారం-నందిగుట్ట ప్రాంతాల్లోని స్థలాలను కలెక్టర్ భవేష్ మిశ్రా పరిశీలించారు. స్థలాలపై సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ప్రణాళిక



**నిజామాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

ఖరీఫ్ 2026-27 ధాన్యం సేకరణ, నిల్వకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాలో 4.35 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 6.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించేందుకు 736 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ మొదటి వారం నుంచే కేంద్రాలను అందుబాటులోకి తేవాలని సూచించారు. గన్నీ బస్తాలు, తేమ కొలిచే యంత్రాలు, వేయింగ్ మెషీన్లు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ధాన్యం నిల్వకు ప్రభుత్వ, మార్కెట్ కమిటీ, ప్రైవేట్ గిడ్డంగులతో పాటు అవసరమైతే మూతపడిన రైస్ మిల్లులు, ఫంక్షన్ హాళ్లు, ఖాళీ స్థలాలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్ రావు, సంబంధిత శాఖల అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.



## బాసర సెక్టార్‌లో పోషణ మాసం కార్యక్రమం

**నిర్మల్--బాసర, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

బాసర సెక్టార్ స్థాయిలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు శ్రీమంత కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా డీడబ్ల్యూఓ వినూత్న మాట్లాడుతూ నెల రోజుల పాటు పోషణ మాసం కొనసాగుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. 'హమారా అంగన్‌వాడీ హమారీ జిమ్మేదారీ' థీమ్‌తో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ రాజశ్రీ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీపీ తనిఖీ

**నేరాల నియంత్రణపై ప్రత్యేక సూచనలు: అంబర్ కిషోర్ ఝా**




**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రికార్డులు, సిబ్బంది బ్యారక్‌ను పరిశీలించి పరిశుభ్రత, 5ఎస్ విధానం అమలుపై సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలోని పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, పెట్రోలింగ్, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై వివరాలు తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హైవే, రైల్వే స్టేషన్ నేపథ్యంలో రహదారి భద్రత, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కొత్త కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, మందమర్రి సీఐ రమేష్, పట్టణ ఎస్సై శ్రీధర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



**నిజామాబాద్--నందిపేట్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి సూచించారు. నందిపేట్‌లో మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండపాల వద్ద రాత్రివేళ నిర్వాహకులు అందుబాటులో ఉండాలని, అగ్నిప్రమాదాల నివారణకు ఇసుక బకెట్లు, నీటి డ్రమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలోనూ భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ సమావేశం లో ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, నందిపేట ఎస్సై వినయ్, ఎంపీడీవో నందిపేట్ విద్యుత్ శాఖ ఏడి , ఏఇ , ఆర్ఐ లు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, అన్ని గ్రామాల గణేష్ మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

## గణపతి నిమజ్జనంలో ట్రాక్టర్ డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**

గణపతి నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ బి. సునీల్ కుమార్ సూచించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సుమారు 70 మంది ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. డ్రైవర్లు చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిమజ్జనం సందర్భంగా విద్యుత్ వైర్లు, లైట్లు, చెట్లను గమనిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.

## భూభారతి దరఖాస్తులు నెలాఖరులోగా పరిష్కరించాలి

### -- కలెక్టర్ భవేష్ మిశ్రా



**నిజామాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
భూభారతి పెండింగ్ దరఖాస్తులన్నింటినీ ఈ నెలాఖరులోగా పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించిన ఆయన, జూలై 31లోపు వచ్చిన అర్జీలు ఒక్కటీ పెండింగ్‌లో ఉండకూడదన్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారదర్శకత, జవాబుదారీతనంతో అర్హులైన వారికి త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్ణీత ధరకే ఇసుక అందేలా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు లాటరీ ద్వారా కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీఆర్‌ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు

## కియా షోరూం సేవల విస్తరణ అభినందనీయం

### - మహ్మద్ అలీ షబ్బీర్



**నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
తెలంగాణలో కియా షోరూం సేవలు విస్తరిస్తుండటం అభినందనీయమని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. బర్దిపూర్ శివారులోని సన్‌రైజ్ కియా షోరూంలో నూతన సోరేంటో కారును మంగళవారం రాత్రి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో సోరేంటో అందుబాటులోకి రావడం శుభపరిణామమన్నారు. షోరూం చైర్మన్ పోచారం సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారని అభినందించారు. ఈ సందర్భంగా తొలి కారును కొనుగోలు చేసిన ప్రముఖ వైద్యుడు రమణేశ్వరరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కే.నాగేష్ రెడ్డి, నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, కియా మేనేజింగ్ డైరెక్టర్ రవి కిరణ్ గౌడ్, సేల్స్ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్, సేల్స్ మేనేజర్ రాయుడు బాబు, నిజామాబాద్ కియా షోరూం జనరల్ మేనేజర్ ఎండల సతీష్ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ కుమారుడికి ఎంబీబీఎస్ సీటు



**నిర్మల్ - భైంసా: సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
భైంసా పట్టణానికి చెందిన జాదవ్ సోమాజీ కుమారుడు జాదవ్ అఖిల్ నీట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించాడు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. విట్టల్‌రెడ్డి అఖిల్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూనే, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కుమారుడిని ఉన్నత విద్య వైపు నడిపించిన జాదవ్ సోమాజీ కృషి అభినందనీయమని విట్టల్‌రెడ్డి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల ప్రకారం విద్య ద్వారానే ఉన్నత స్థానాలను సాధించవచ్చని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బుచ్చన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాగర్‌రావు, సంజీవ్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

## మెగా ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ నరసింహ



**సూర్యాపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
కోదాడలో ఈ నెల 19న సీసీ రెడ్డి కాన్వెంట్‌లో నిర్వహించనున్న మెగా ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సూచించారు. బుధవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఉద్యోగ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 250 ప్రముఖ సంస్థలు మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ముందుగా స్కానర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని, తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాలరాజు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ కన్నా రేవంత్ నయం

- పీసీసీ చీఫ్ కు కామన్ సెన్స్ లేదు. పరిపాలనపై అవగాహన లేదు
- కవిత ఔట్ డేటెడ్ పర్సన్
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి



**నిజామాబాద్, సెప్టెంబర్16 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ, రాష్ట్ర స్థాయిలో రేవంత్ రెడ్డి, జిల్లా స్థాయిలో మహేష్ కుమార్ గౌడ్ వల్లనే బిజేపీ గెలుపు మరింత సునాయాసంగా జరుగుతుందన్ నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయలలో ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయమని, మరోసారి మోడీ ప్రధాని కావడం ఖాయమని ప్రజల గుండెల్లో నిలిచిన వారే నిజమైన నాయకులని మొఖాలు చూస్తే ఓట్లు పడవన్నారు. రాహుల్ గాంధీ కంటే రేవంత్ రెడ్డి నయమని కుండబద్దలు కొట్టారు. రేవంత్ రెడ్డి చర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నుంచి వన్యప్రాణులను తరిమికొట్టారన్నారు. లక్షన్నర కోట్ల విలువ చేసే యూనివర్సిటీ భూములను దోచుకునేందుకే రేవంత్ ప్లాన్ చేశాడన్నారు. పీసీసీ చీఫ్ మ హేష్ కుమార్ గౌడ్ కు కామన్ సెన్స్ లేదని, పరిపాలనపై అవగాహన లేదన్నారు. కవిత ఔట్ డేటెడ్ పర్సన్ అని కవిత ఏ టాక్స్ వల్లనే మాదవనగర్ కాంట్రాక్టర్లు సరిపోయారని అందువల్లనే ఆర్ వోబి ఆలస్యం అయిందని అన్నారు. కేసీఆర్ ది ఫాంహౌజ్ పాలన అని మరోసారి గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు ఇవ్వకపోవడం వల్లే జిల్లాలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో మోదీ ఫోటో పెట్టాల్సిందేనన్నారు. 22ఏ కారణంగా నిషేధత జాబితాలో ఉన్న భూములను... రేవంత్ వెంటనే అందులోంచి తొలగించాలి అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకానికి రాష్ట్ర ప్రభుత్వం వాటా విధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**నేడు మోడికి మంచి ఆయుష్షు ఇవ్వాలని దీపం వెలిగించి ప్రార్థిద్దాం**
నరేంద్ర మోది ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి మోది ప్రపంచ స్థాయి నేత మోది అందరికి స్ఫూర్తి దాత.. మోది సిద్ధాంతాలు ఎందరినో ఆకర్షిస్తాయని ఎంపీ అర్వింద్ అన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా సంకల్ప దివస్ పేరుతో నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మోదీ జన్మదినం సందర్భంగా గురువారం (ఈ నెల 17న) సాయంకాలం అందరూ దీపం వెలిగించి ఆయనకు మంచి ఆయుష్షు ఇవ్వాలని అందరం ప్రాప్తిద్దామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా ఆధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి గోపిడి స్రవంతి రెడ్డి, జాతీయ కార్యవర సభ్యులు మోహన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, గద్దె భూమన్న, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**చౌటుప్పల్ సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)**
నల్గొండ జిల్లా చందూరు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మకంటి సత్యనారాయణ మాతృమూర్తి బొమ్మకంటి రామలింగమ్మ ఇటీవల మరణించిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి వారి మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు పార్టీ కార్యకర్తల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూగర్భ జలాల పునరుద్ధరణకు ఫార్మ్ కుంటలు ఉపయోగకరం

### సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ



**చౌటుప్పల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఫార్మ్ కుంటలు ఎంతో ఉపయోగపడతాయని ఎస్. లింగోటం సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమిడి ప్రదీప్ జీ అన్నారు. బుధవారం గ్రామంలోని శివుని బావి చెల్కలో జలసిరి కార్యక్రమంలో భాగంగా ఫార్మ్ కుంట నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. పొలాల నుంచి వృథాగా బయటకు వెళ్లే వర్షపు నీటిని కుంటల్లో నిల్వ చేయడం ద్వారా భూమిలోకి నీరు ఇంకి భూగర్భ జలాలు, నేలలో తేమ పెరుగుతాయని తెలిపారు. రైతుల భవిష్యత్తు, నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని గ్రామంలో మరిన్ని ఫార్మ్ కుంటలు నిర్మించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ్య, గ్రామ సెక్రటరీ మచ్చగిరి, వార్డు సభ్యులు ఉప్పు వీరేశం, పిట్టల సదానందం, శోభ, పల్లం శంకరయ్య, బాతరాజు లింగస్వామి, చగనగోని సుశీల, తూర్పింటి సుజాత, షేగురి లింగస్వామి, రాధారపు సత్తయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కళమ్మ, గ్రామ పెద్దలు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుడి అరెస్టు



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో,( సెప్టెంబర్ 16 )**
: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల విడుదల కోసం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన బీఆర్ఎస్వీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని కేయూ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి జట్టి రాజేందర్ ఖండించారు. ఇందులో భాగంగా ఆయనను హసన్‌పర్తి పోలీసులు బుధవారం ఉదయం అరెస్టు చేశారు. రెండు, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సర్టిఫికెట్లు కళాశాలల్లో నిలిచిపోవడంతో విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



## క్రీడలతో నాయకత్వ లక్షణాల అభివృద్ధి

**హసన్‌పర్తి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
క్రీడలతో విద్యార్థుల్లో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని ఎంఈఓ, ఎస్‌జీఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఏ. శ్రీనివాస్ అన్నారు. బుధవారం హసన్‌పర్తి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలల్లో 70వ ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి అండర్-13, అండర్-17 బాలబాలికల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొని ప్రతిభను చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, సుమాదేవి, మాజీ కార్పొరేటర్ శివకుమార్, దాత రాము, శోభారాణి, ఎస్‌జీఎఫ్ఐ జిల్లా బాధ్యులు వాసుదేవరావు, శ్రీధర్, టీజీపేట అధ్యక్షుడు పార్థసారథి, కార్యదర్శి మల్లారెడ్డి, మండల కార్యదర్శి శారద, పీడీలు బాలమురళీకృష్ణ, నవీన్‌కుమార్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవం



**వనపర్తి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి ఆర్టీసీ డిపో ఎదుట స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు ఏజీ కృష్ణ జెండా ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు మాట్లాడుతూ పెంచిన పని భారాన్ని తగ్గించాలని, రూట్ సర్వే చేసి టైమింగ్స్ కేటాయించాలని, అలవెన్సులు 80 శాతం పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని, జూనియర్ అసిస్టెంట్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి పోస్టింగులు ఇవ్వాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ కృష్ణయ్య,ఎస్ వెంకటయ్య, రీజియన్ సహాయ కార్యదర్శి ఎండి ఖయ్యూం, డిపో అధ్యక్ష,కార్యదర్శులు కేజీ కృష్ణ, సి నాగేశ్వర్, ఉపాధ్యక్షుడు నారాయణ తదితరులు కార్మికులు పాల్గొన్నారు.

## నీటి వృథాకు అడ్డుకట్ట వేసిన వజ్రాల రమేష్

**వనపర్తి, సెప్టెంబర్ 16 (గంధం రవికుమార్, తెలంగాణ వాణి ప్రతినిధి):**
వనపర్తి జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో బోరు నీటి పైప్ లీకేజీతో వృథాగా పోతున్న నీటిని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు వజ్రాల రమేష్ అరికట్టించారు. లీకేజీ కారణంగా రహదారిపై నీరు నిలిచి సమీప పాఠశాల విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించారు. కొత్త గేట్‌వాల్ ఏర్పాటు చేసి పైప్ లీకేజీని సరిచేయడంతో నీటి వృథాకు అడ్డుకట్ట పడింది. సమస్యను వెంటనే పరిష్కరించిన వజ్రాల రమేష్‌ను స్థానికులు అభినందించారు.



## పోలీస్ కళాబృందంతో అవగాహన కార్యక్రమం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి బస్టాండ్‌లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, మైనర్ డ్రైవింగ్, సైబర్ నేరాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ రాజు సూచనలతో ఏఎస్ఐ బి. దేవాగౌడ్ ఆధ్వర్యంలో మాటలు, పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల కోసం 1930, అత్యవసర సేవలకు 112, షీ టీమ్ 8712686094 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, ఓటీపీలు ఎవరికీ చెప్పకపోవడం, గుర్తుతెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## ఎల్లారెడ్డి సహకార సంఘం ఆధ్వర్యంలో మహాజన సభ



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఏగుల నర్సింలు అధ్యక్షతన బుధవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2026 ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 30 వరకు జమా ఖర్చుల వివరాలను కార్యదర్శి సభకు వివరించారు. రైతుల పంట రుణమాఫీని అందరికీ ఒకేసారి వర్తింపజేయాలని, ఎకరానికి రూ.75 వేల వరకు స్వల్పకాలిక రుణాలు ఇవ్వాలని, దీర్ఘకాలిక రుణాలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వర్తింపజేయాలని తీర్మానించారు. యూరియా యాప్‌ను తొలగించి పాత విధానాన్ని కొనసాగించాలని, సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు ఆమోదించారు. సంఘం ఉపాధ్యక్షుడు మతమాల ప్రశాంత్ గౌడ్, డైరెక్టర్లు, రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన రూట్, పెద్ద చెరువు పరిశీలన



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎల్లారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో నిమజ్జన రూట్, పెద్ద చెరువును ఆర్డీవో, డీఎస్పీ, సీఐ, మున్సిపల్ కమిషనర్, విద్యుత్ శాఖ ఏఈ, ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లను పరిశీలించి, నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## గాంధీగిరితో మున్సిపల్ అధికారుల వినూత్న నిరసన



**చౌటుప్పల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చౌటుప్పల్ మున్సిపల్ సిబ్బంది వినూత్నంగా 'గాంధీగిరి' పద్ధతిని అవలంబించారు. ఎన్‌హెచ్-65 వలిగొండ జంక్షన్--లింగోజిగూడెం రహదారి వద్ద చెత్త వేస్తున్న నలుగురిని పట్టుకుని పూలదండలు వేసి అవగాహన కల్పించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున జరిమానా విధించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు చెత్తను మున్సిపల్ సేకరణ వాహనాలకే అందించి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రేణు కుమార్, జవాన్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌పీఆర్‌డీ ఇండియా మండల కమిటీ ఏకగ్రీవం



**పెబ్బేరు, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఎన్‌పీఆర్‌డీ ఇండియా వనపర్తి జిల్లా పెబ్బేరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాలస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆది జనార్ధన్, జిల్లా కార్యదర్శి సుశీల, నరసమ్మ, గోవిందమ్మ ఆధ్వర్యంలో ఎన్నికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, పింఛన్లు, రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అర్హులైన దివ్యాంగులకు అందేలా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్తామని పేర్కొన్నారు. నూతన కమిటీకి జిల్లా నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## నర్సంపేట ప్రెస్ క్లబ్ అడహాక్ కమిటీ ఎన్నిక



**నర్సంపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
నర్సంపేట ప్రెస్ క్లబ్ అడహాక్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కలువల ఆనందరావు, కో–కన్వీనర్లుగా పోడేటి అశోక్, వంచే రాజేందర్ రెడ్డి, వడ్లకొండ రాజ్‌కుమార్ గౌడ్, ఊరటి రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల విధివిధానాలు, బైలా రూపకల్పన, ఎన్నికల నిర్వహణపై సమావేశంలో చర్చించారు. మాజీ కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎల్ఎల్‌బీ పాస్

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**



అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎల్ఎల్‌బీ ఫస్ట్ ఇయర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే న్యాయ విద్యను కొనసాగించడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ ఎల్ఎల్‌బీ చదువుతున్నట్లు ఆయన తెలిపారు. న్యాయ విద్య ద్వారా రాజ్యాంగం, చట్టాలు, ప్రజల హక్కులపై మరింత అవగాహన పెంపొందించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## టేకులపల్లిలో ప్రపంచ నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు



**టేకులపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
టేకులపల్లి మండలంలో ప్రపంచ నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు మావునూరి రమేష్ ఆధ్వర్యంలో కులవృత్తి జెండాను ఆవిష్కరించి, కుల పెద్దలను సన్మానించారు. ముఖ్య అతిథులుగా టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, గోలియాతండా సర్పంచ్ లకావత్ నాకా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మావునూరి రమేష్ మాట్లాడుతూ కులవృత్తిదారులకు రూ.10 లక్షల ఉచిత ప్రమాద బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని, ఆధునిక సెలూన్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలు, కుల భవనాలు, పేద విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఉమేష్, మావునూరి రాజు, జనగాం లక్ష్మయ్య, వంశీ, వెంకన్న, రాజు, అశోక్, రాజన్న, ముదిగొండ రాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..



**ఖమ్మం, సెప్టెంబర్:16 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
– త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు.ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి,ఈ.వి.ఎం., వి.వి.ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు.తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.అలారం,ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు.సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు.ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని,సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు,ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్,ఎన్నికల డిటి అన్సారీ,ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, బహుజన్ సమాజ్ పార్టి ప్రతినిధి వేల్పుల రామయ్య,బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బి. వేణుగోపాల్,బిజెపి పార్టీ ప్రతినిధి వి.రాజేష్, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్.ప్రకాష్,ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు,టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు,తదితరులు ఉన్నారు..

# లోది సామాజిక వర్గ సమస్యలపై బీసీ కమిషన్ అధ్యయనం

**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
లోది సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సామాజిక, విద్యా, ఉపాధి, ఆర్థిక సమస్యలను అధ్యయనం చేసేందుకు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాల లక్ష్మీరంగు బుధవారం పెద్ద శంకరంపేట మండలంలోని లోది కాలనీలో పర్యటించారు. సంఘం ప్రతినిధులు, ప్రజల నుంచి సమస్యలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ లోది సామాజిక వర్గం సామాజికంగా,





ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక వివక్షకు తావులేకుండా చూడాలని తెలిపారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ లోది వర్గానికి విద్య, ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, తహసిల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతికుమార్, సర్పంచ్ జంగం రేణుక శ్రీనివాస్, అధికారులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఖమ్మం బ్యూరో):**
ఎస్ఐఆర్‌లో భాగంగా మ్యాపింగ్ కాని, అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల జారీ, హియరింగ్, డాక్యుమెంట్ల స్వీకరణ, అప్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరంలోని పాత డీఆర్డీఏ కార్యాలయ ఆవరణలో బీఎల్‌ఓలు నిర్వహిస్తున్న హియరింగ్ ప్రక్రియను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు గల్లంతు కాకుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. బీఎల్‌ఓలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు నిర్దేశిత తేదీల్లో హియరింగ్‌కు హాజరై అవసరమైన పత్రాలు సమర్పించాలని కలెక్టర్ కోరారు.

## విద్యుత్ సరఫరా బలోపేతానికి ప్రత్యేక చర్యలు: ఎస్ఈ గంగాధర్



**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
వినియోగదారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు పంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు పెద్దపల్లి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వి. గంగాధర్ తెలిపారు. ఇందులో భాగంగా 4 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు, 16 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 388 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 10.9 కి.మీ. 33 కేవీ, 27.03 కి.మీ. 11 కేవీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తక్కువ వోల్టేజీ సమస్యల నివారణకు కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్ల తనిఖీలు, లూజ్ కనెక్షన్ల సవరణ, అత్యవసర స్పందన బృందాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ లక్ష్యమని తెలిపారు.

## బోసిపోతున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయం



**చిగురుమామిడి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి):**
మండలంలో ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ పదవులు ఖాళీగా ఉండటంతో మండల ప్రజా పరిషత్ కార్యాలయం బోసిపోతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల సమస్యలు, అభివృద్ధి అంశాలపై సర్వసభ్య సమావేశాలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీటీసీ తదితర స్థానాలకు ఎన్నికలు నిర్వహించి స్థానిక సంస్థలను బలోపేతం చేయాలని, గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు

## వినాయక నిమజ్జనంలో అపశృతి.. ఆరుగురు పిల్లలు మృతి

వినాయక నిమజ్జనంలో తీవ్ర అపశృతి చోటు చేసుకుంది. శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో చదువుతున్న ఆరుగురు పిల్లలు మృతి చెందారు. వినాయక చవిత సందర్భంగా సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం మండలం పెద్దకంజర్లలో మూడు రోజుల పాటు గణేష్ పూజలు వైభవంగా నిర్వహించారు. నిమజ్జనం కోసమే నేరెడు చెరువుకు వినాయక విగ్రహాన్ని తీసుకెళ్లారు. అయితే ఈ క్రమంలో పిల్లలు చెరువులో గల్లంతయ్యారు. ఒకరిని మరొకరు కాపాడే ప్రయత్నంలో ఆరుగురు పిల్లలు నీటిలో మునిగిపోయారు. స్థానికులు రక్షించేలోపే నీటిలో మునిగిపోయి మృత్యువాత పడ్డారు.



## గణేష్ నవరాత్రుల్లో డీజే నిర్వాహకులకు బైండోవర్

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్సై గట్ల సుధాకర్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కాల్వ శ్రీరాంపూర్‌లో డీజే నిర్వాహకులను బుధవారం బైండోవర్ చేశారు. అధిక శబ్దంతో డీజేలు నిర్వహించరాదని, పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై గట్ల సుధాకర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు బీజేపీ నాయకుల ఘన స్వాగతం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
తెలంగాణ అధికారిక పర్యటనలో భాగంగా ఎన్టీపీసీ జ్యోతి భవన్‌కు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు, సంబంధిత వర్గాలు సమర్పించిన వినతిపత్రాలను హుస్సేన్ స్వీకరించి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు సాగర్ రాజు, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ముస్కూల భాస్కర్ రెడ్డి, పాలకుర్తి మండల అధ్యక్షుడు మేరుగు నరేష్ గౌడ్, నాయకులు కోడూరి రమేష్, జక్కుల పద్మ, ప్రవీణ్, ఏ. రాజయ్య, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇళ్లు

**జీవో 33 ప్రకారం ఎంపిక పారదర్శకంగా ఉండాలి: సర్పంచ్ ఎలుక అంజనేయులు**



**తిమ్మాపూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను జీవో 33 ప్రకారం అర్హత ఆధారంగా పారదర్శకంగా చేపట్టాలని రేణికుంట సర్పంచ్ ఎలుక అంజనేయులు కోరారు. ఈ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, హౌసింగ్ బోర్డు కమిషనర్ వి.పి. గౌతమ్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా సంబంధిత కమిటీ సభ్యుల సమక్షంలో అర్హులను గుర్తించాలని కోరారు. ఇళ్ల మంజూరుకు డబ్బులు చెల్లించాలంటూ కొందరు మధ్యవర్తులు చెబుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయని తెలిపారు. మధ్యవర్తుల జోక్యాన్ని అరికట్టి నిజమైన పేదలకే ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందించి, జీవో 33 ప్రకారం పారదర్శక ఎంపికకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అంజనేయులు తెలిపారు

## ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి



**టేకులపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని మండల అధ్యక్షుడు గుగులోత్ రామచంద్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న జాతీయ మహాసభల గోడపత్రికలను రోళ్లపాడు గ్రామంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామచంద్ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. 28న జరిగే బహిరంగ సభతో పాటు 29, 30 తేదీల్లో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోడం రవి, చీమల భద్రయ్య, పూనెం రామస్వామి, కొడెం ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## చర్లలో ఘనంగా నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలు

**కులవృత్తి పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి: తోటపల్లి రమణ**



**చర్ల, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
చర్ల మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం 500/82 ఆధ్వర్యంలో ధన్వంతరి స్వామికి పూజలు నిర్వహించి, నాయి బ్రాహ్మణ జెండాను ఆవిష్కరించారు. అనంతరం 60 ఏళ్లు దాటిన వృద్ధులను సన్మానించి, బైక్ ర్యాలీ, అన్నదానం నిర్వహించారు. మండల అధ్యక్షుడు తోటపల్లి రమణ మాట్లాడుతూ సంప్రదాయ క్షౌరవృత్తి పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. యువతకు ఉచిత శిక్షణ, సెలూన్ల ఏర్పాటుకు సబ్సిడీ, తక్కువ వడ్డీ రుణాలు, ఆరోగ్య––ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంబి కుమారి, గోరింట్ల వెంకటేశ్వరరావు, తోటపల్లి మాధవరావు, తోటపల్లి రాంబాబు, తోటపల్లి శ్రీనివాసరావు, కోండ్రు హరీష్, గోరంట్ల శ్రీనివాసరావు, సుంకర రాజేష్, అయినవిల్లి శ్రీను, నేదునూరి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉమామహేశ్వర ఆలయంలో టీ.జీ. శిల్ప ప్రత్యేక పూజలు



**అచ్చంపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**
అచ్చంపేట మండలంలోని శ్రీశైల ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి చెందిన శ్రీ ఉమామహేశ్వర దేవస్థానంలో ఆంధ్రప్రదేశ్ మంత్రి టీ.జీ. భరత్ సతీమణి టీ.జీ. శిల్ప, స్వర్ణ గౌరీ గ్రూప్ సభ్యురాలు సోమిశెట్టి శ్రీవాణి బృందం బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించింది. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. దేవస్థానం చైర్మన్ బీరం మాధవరెడ్డి, పాలకమండలి సభ్యులు, ఈవో శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు వీరయ్య వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఆలయ ఆధ్యాత్మిక వాతావరణం, నిత్య అన్నదాన కార్యక్రమాన్ని టీ.జీ. శిల్ప ప్రశంసించారు.

## సేవా సంకల్ప్ అభియాన్ మండల కార్యశాల



**అచ్చంపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి న్యూస్ ప్రతినిధి):**
అచ్చంపేట పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు నివాసంలో బీజేపీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్' మండల కార్యశాల బుధవారం నిర్వహించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు చేపట్టనున్న కార్యక్రమాల్లో ప్రజాసేవ, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని నిర్ణయించారు.మండల కో–కన్వీనర్ పోలం ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశానికి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు కాత్రావతి జ్యోతి, జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు జానకి, సోషల్ మీడియా ఇన్‌చార్జి అఖిల్ రెడ్డి, పిట్టల కృష్ణయ్య, కాశన్న గౌడ్, దేవేందర్ రెడ్డి, గాలిమూడి రాము, కిరణ్, బాల గౌడ్, సాయిబాబు, శ్రీశైలం, కాశి పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులకు బీజేపీ నాయకుల ఘన స్వాగతం



**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
తెలంగాణ అధికారిక పర్యటనలో భాగంగా ఎన్టీపీసీ జ్యోతి భవన్‌కు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌కు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు, సంబంధిత వర్గాలు సమర్పించిన వినతిపత్రాలను హుస్సేన్ స్వీకరించి, సమస్యలను పరిశీలించి తగిన చర్యలకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు సాగర్ రాజు, భాస్కర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నర్సింహారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు ముస్కూల భాస్కర్ రెడ్డి, పాలకుర్తి మండల అధ్యక్షుడు మేరుగు నరేష్ గౌడ్, నాయకులు కోడూరి రమేష్, జక్కుల పద్మ, ప్రవీణ్, ఏ. రాజయ్య, అనిల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇంజినీర్స్ డే--2026 వేడుకలు



**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**
సాంకేతిక అభివృద్ధి, విద్యుత్ రంగ బలోపేతం, దేశ నిర్మాణంలో ఇంజినీర్ల సేవలను స్మరించుకుంటూ ఎన్టీపీసీ రామగుండంలో ఇంజినీర్స్ డే--2026 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ (ఆర్అండ్‌టీ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ చంద్రమౌళి గడ్డమంగు ముఖ్య అతిథిగా, ఈడీ (ఆర్అండ్‌టీ) చందన్ కుమార్ సమంతా గౌరవ అతిథిగా హాజరయ్యారు. సర్ ఎం. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ చంద్రమౌళి గడ్డమంగు నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, నిరంతర అభ్యాసంపై ప్రసంగించారు. ఇంజినీర్స్ డే క్విజ్--2026 విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఈఏఆర్ (ఆర్అండ్‌టీ) అధ్యక్షుడు పి. విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించొద్దు

**ప్రజలపై డిజిటల్ చెల్లింపుల భారం మోపొద్దు: జూపాక శ్రీనివాస్**

**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి):**



సాధారణ యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు విధించకూడదని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. యూపీఐ చిన్న వ్యాపారులు, కార్మికులు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు సులభమైన చెల్లింపు విధానంగా మారిందన్నారు. భవిష్యత్తులో యూపీఐపై ఛార్జీలు విధిస్తే ప్రజలు, చిన్న వ్యాపారులపై అదనపు ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఉచిత సేవలను కొనసాగిస్తూ, ఎలాంటి ఛార్జీలు విధించబోమని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. యూపీఐ ఛార్జీలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

## జర్నలిస్టులపై దుర్భాషలు, బెదిరింపులపై ఫిర్యాదు




**మల్లాపూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
వార్త ప్రచురించినందుకు జర్నలిస్టులను దుర్భాషలాడుతూ బెదిరించిన మాజీ ఎంపీపీ నల్ల రాజన్నపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అటవీ ప్రాంతంలో టేకు కలప నరికివేతపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వార్తలు ప్రచురించిన నేపథ్యంలో తమకు ఫోన్ చేసి అసభ్య పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని మల్లాపూర్ రిపోర్టర్ రుద్ర రాంప్రసాద్, జర్నలిస్టు మోర సతీష్ తెలిపారు. బుధవారం జర్నలిస్టులు మల్లాపూర్ ఎస్సై అనిల్‌ను కలిసి ఆడియో రికార్డింగ్ సాక్ష్యాలతో ఫిర్యాదు అందజేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించి, బెదిరింపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## వెంకటేశ్వర్లపల్లెలో ఉచిత వైద్య శిబిరం



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లెలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ ఆకుల శ్రీనివాస్, జనరల్ సర్జన్ డాక్టర్ మహిపాల్, న్యూరాలజిస్ట్ డాక్టర్ భరత్, గైనకాలజిస్ట్ డాక్టర్ గ్రీష్మ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ పరీక్షలతో పాటు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. గ్రామీణ ప్రాంతాల పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రుల మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన సర్పంచ్ పోల్సాని వినోద-నారాయణరావు, ఉప సర్పంచ్ రేబెల్లి వెంకటేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలకు ఆసుపత్రి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

# మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలి

**బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి**

**పచ్చిమట్ల రవీందర్ గౌడ్**

**హుస్నాబాద్ సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఆర్ సి)**
హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో హరితహారం, వనమహోత్సవం కార్యక్రమాల కింద నాటిన మొక్కల సంరక్షణ పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ కోరారు. ఏటా మొక్కలు నాటుతున్నప్పటికీ ఎండిపోవడం, పశువులు తినడం వల్ల అనేక మొక్కలునష్టపోతున్నాయని తెలిపారు. మొక్కలు నాటే ముందు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, విద్యుత్ తీగల కింద, రహదారులకు ఆటంకం కలిగించే ప్రాంతాల్లో నాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలనిసూచించారు. ప్రధాన రహదారుల వెంట తగినంతదూరంపాటించాలని కోరారు. మొక్కలు నాటడం




మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు బాధ్యత వహించాలని అన్నారు. నిధుల వినియోగంలోపారదర్శకత పాటించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు శంకర్, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం

**ఎండపల్లి: సెప్టెంబర్16(తెలంగాణ వాణి)**
గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పాతగుడూర్ గ్రామంలోని మెయిన్ రోడ్‌లో వెలసిన శ్రీ సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముక్తి శేఖర్ - మానస దంపతుల పుత్రుడు విహాందర్ష్ సౌజన్యంతో ఈ అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ మేడిపెల్లి సత్తయ్య హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు మాట్లాడుతూ... గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఇలాంటి ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్వామివారి కృపతో గ్రా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ



కార్యక్రమంలో వార్డు సభ్యులు, సిద్ధి వినాయక యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## 7వ వార్డులో రోడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు

**నిర్మాణాలను పరిశీలించి చర్యలు**

**తీసుకోవాలని కమిషనర్‌కు వినతి**

**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు దుర్గా కాలనీలో మున్సిపల్ సీసీ రోడ్డుపై ఆక్రమణలు జరిగాయని స్థానికులు ఆరోపించారు. విద్యోదయ స్కూల్ మెయిన్ రోడ్డు నుంచి హాస్టల్ వరకు ఉన్న రహదారిపై గోడలు, మెట్లు, ఇతర నిర్మాణాలు చేపట్టినట్లు పేర్కొంటూ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామికి బుధవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డుపై నిర్మాణాలతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారి హద్దులను గుర్తించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే తొలగించి రహదారిని ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాధ రాంబాబు, మీడివెల్లి సంపత్, మారేల్ల రవి, రాధ నరేష్, చొప్పరి సదానందం, చొప్పరి రాము, ఒద్ది శ్రీకాంత్, రాధ భరత్, ముకుంద సాయి వంశీ, మూడేడ్ల గణేష్, పకిడె మణికంఠ, పెంతల సురేందర్, బోల్లం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో డిటు మార్ట్ ప్రారంభం.



**హుస్నాబాద్, సెప్టెంబర్ 16(తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిటు మార్ట్ హుస్నాబాద్, అక్కన్నపేట ప్రధాన రోడ్డులోవెంకటేశ్వర హాస్పిటల్ ఎదురుగా ఏర్పాటు చేసిన మార్ట్‌ను హుస్నాబాద్ సీఐ శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ డిటు మార్ట్‌లో వినియోగదారులకు అవసరమైన అన్ని రకాల కిరాణా సరుకులు, వంటసామగ్రి,గృహోపకరణాలు,నిత్యావసర వస్తువులు ఒకే చోట అందుబాటులోఉంటాయని తెలిపారు. నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటు ధరలలో అందించడంతో పాటు వినియోగదారులను ఆకట్టుకునేలా ప్రత్యేక ఆఫర్లను కూడా అందుబాటులోకి తీసు కొచ్చినట్లు పేర్కొన్నారు. పట్టణప్రజలకు మరింతసౌకర్యవంతమైన షాపింగ్ అనుభవాన్ని అందించాలనే ఉద్దేశంతో డిటు మార్ట్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తిప్పిరి శ్రీనివాస్ తెలిపారు. హుస్నాబాద్ ప్రజలు మార్ట్‌ను సందర్శించి అందు బాటులో ఉన్న ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థులకు యూనిఫామ్, షూస్ పంపిణీ



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
కల్లూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చిట్నేని లత--రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫామ్, షూస్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగా స్వామి, వార్డు సభ్యులు తడ్ర సునీత, రామగిరి శ్రీధర్, చిట్నేని శైలజ, సంకే స్రవంతి, గజం గంగాధర్, చిట్నేని జగన్, వనతడుపుల పెద్దిరాజు, పంచాయతీ కార్యదర్శి శ్రీరాముల సరిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరహరి, ఉపాధ్యాయులు రాజేష్, లత, కారోభార్ అచ్చ ప్రమోద్, అంగన్వాడీ టీచర్ సంధ్య, గ్రామ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

**తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి**



**హుస్నాబాద్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ఆర్‌సీ)**
: సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని కోరుతూ బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు భూక్యా సంపత్ నాయక్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. చారిత్రక పోరాటంలో అమరులైన వారి త్యాగాలను భావితరాలకు తెలియజేసేలా అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని సంపత్ నాయక్ కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు బైరి అరుణ్, తడిసిన రమేష్ రెడ్డి, బూతగడ్డపు బాలరాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పూదరి కిష్టయ్య, యువమోర్చా అధ్యక్షుడు సొల్లు రజినీకాంత్, నాయకులు కుంట మల్లయ్య, మెరుగు రవీందర్, పెనాల శ్రీనివాస్, బొల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



**తిమ్మాపూర్, సెప్టెంబరు 16,( తెలంగాణ వాణి ప్రతినిధి )**
అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని మహాత్మనగర్ గ్రామ సర్పంచ్ పొన్నాల సంపత్ అన్నారు. బుధవారం స్థానిక వెంకటేశ్వర ఆలయ ఆవరణలో స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేతిరెడ్డి ఎల్లారెడ్డి, వార్డు సభ్యుడు కనుకమల్లు, రేషన్ డీలర్లు రజియా, శారద, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎడ్ల అంజిరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఇంజనీర్ల సేవలకు ఘన సత్కారం

**తిమ్మాపూర్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
దేశ ప్రగతిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని టీఐఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం లక్ష్మణ్‌రావు, టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎల్ఎండీ కాలనీలోని క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయంలో బుధవారం సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఉత్తమ సేవలందించిన ఇంజనీర్లను శాలువాలు, పుష్ప గుచ్ఛాలు, మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ శ్రీనివాస్, ఏఈఈలు అమీర్ అహ్మద్ ఖాన్, కరుణాకర, ప్రీతి పాండే, ఈ. రాజ్‌కుమార్, డీఈఈ జూలూరి సంతోష్, ఉద్యోగ సంఘాల నాయకులు గంగారపు రమేష్ గౌడ్, ప్రసాద్‌రెడ్డి, మామిడి రమేష్, సర్దార్ హర్మేందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, కోట రామస్వామి, అస్గర్ అలీ, చైతన్యరెడ్డి, బత్తిని వెంకటరమణ, రాజయ్య పాల్గొన్నారు.

## ప్రశాంతంగా వినాయక శోభాయాత్ర నిర్వహించాలి

**డీజేలకు అనుమతి లేదు: ఎస్సై జగదీశ్వర్**



**చిగురుమామిడి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి):**
వినాయక చవితి నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని చిగురుమామిడి ఎస్సై జగదీశ్వర్ నిర్వాహకులకు సూచించారు. ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా డీజే సౌండ్ సిస్టమ్స్ నిర్వహించే 14 మంది ఆపరేటర్లను గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఊరేగింపుల్లో డీజేలు వినియోగించరాదని, పోలీసుల ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## కోరుట్లలో అంగన్వాడీ కార్యకర్త హత్య




**కోరుట్ల, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి రూరల్):**
జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో అంగన్వాడీ కార్యకర్త అన్నం లక్ష్మి హత్యకు గురయ్యారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త అన్నం నరేష్ హత్యకు పాల్పడినట్లు సమాచారం. బుధవారం ఉదయం దంపతుల మధ్య వాగ్వాదం జరగడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న కోరుట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 24 గంటల్లో హత్య కేసును ఛేదించిన జమ్మికుంట పోలీసులు

**భూ వివాదం నేపథ్యంలో రాజబాబు హత్య.. నిందితులు అదుపులో**



**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని తనుగుల గ్రామంలో భూ వివాదం నేపథ్యంలో బొజ్జపల్లి రాజబాబు హత్యకు గురైన కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. భూమి విషయంలో కుటుంబ సభ్యులతో రాజబాబుకు తరచూ గొడవలు జరిగేవి. సెప్టెంబర్ 10న కుటుంబ సభ్యులతో జరిగిన ఘర్షణలో జూపాక శంకర్, చేతి వెంకటేష్, మారపెల్లి రాజయ్య, జూపాక సతీష్ తదితరులు రాజబాబును కొట్టి, మంచానికి కట్టివేసినట్లు తెలిపారు. అనంతరం శంకర్ చున్నీతో మెడ బిగించడంతో రాజబాబు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతదేహాన్ని పొలంలో పూడ్చిపెట్టినట్లు తెలిపారు. పార, గడ్డపార, సైకిల్, చున్నీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భూ, కుటుంబ వివాదాలను చట్టపరంగా పరిష్కరించుకోవాలని పోలీసులు సూచించారు.

## ఇంటి నుంచి గెంటేశారు న్యాయం చేయండ

శేరిలింగంపల్లి : తమ కొడుకు, కోడలు తనను ఇంటి నుంచి గెంటివేశారని, తమకు తెలియకుండా ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ వృద్ధ దంపతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్లకార్డుతో నిరసన చేపట్టారు. మియాపూర్ ఆల్విన్ కాలనీలో దేవులపల్లి లక్ష్మణ్, జయలక్ష్మి దంపతులు తమ కొడుకు దేవులపల్లి రవికుమార్, కోడలు ప్రసూన తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తమను చూసుకోకుండా, ఇంటి నుంచి బయటకు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా ఇంటిని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ ఈ వ్యవహారం పై అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. వృద్ధ దంపతుల ఆరోపణల పై సంబంధిత అధికారులు విచారణ జరిపి ఆదుకోవాలని కోరారు

## 28న మాదిగల ఆత్మీయ సభను విజయవంతం చేయాలి



**రాజపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి):**
ఈ నెల 28న నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఇంజ మహేష్ మాదిగ పిలుపునిచ్చారు. రాజపేట మండలంలో ఎన్నికైన మాదిగ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను సభలో సన్మానించనున్నట్లు తెలిపారు. ఆత్మ కమిటీ డైరెక్టర్‌గా ఎన్నికైన బడే ఉపేంద్ర, ఎమ్మార్పీఎస్ చల్లూరు గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామి మాదిగలను సన్మానించారు. సభకు అన్ని పార్టీల్లో ఉన్న మాదిగలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాంగోళ్ల కృష్ణ మాదిగ, దుబ్బాసి శ్రీనివాస్ మాదిగ, సర్పంచుల ఫోరం మండల ఉపాధ్యక్షుడు నడిమింటి నరేష్ మాదిగ, ఉప సర్పంచులు శ్రీకాంత్, కర్ణాకర్, కళ్యాణి రాజు, నాయకులు చొల్లేటి స్వామి మాదిగ, పట్నం గణేష్ మాదిగ, ఇంజ స్టీవెన్ మాదిగ, అంబేద్కర్ మాదిగ, భూపాల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల కనీస వేతనం పెంచాలి




**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కోరుట్ల ఆర్డీఓ కార్యాలయం ఎదుట బుధవారం ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కార్మికులకు పని భద్రత, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ నాయకుడు సుతారి రాములు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగెపు పద్మ, కొంక భాగ్యలక్ష్మి, చలిగార గంగు, పరమేశ్వరి, హైమద్ బేగం, ఏఐటీయూసీ జిల్లా నాయకులు హనుమంతు, శ్రీగాదే దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు



**కోరుట్ల రూరల్, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
పైడిమడుగు రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ పంట మార్పిడిలో భాగంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ మాట్లాడుతూ ప్రభుత్వం మొక్కలు, డ్రిప్‌కు సబ్సిడీలు అందిస్తోందని, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో సర్పంచ్ బడుగు భూమేశ్వర్, ఏఈఓ అనిల్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ భరత్, ఆత్మ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

## డిండి మండల ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం



**డిండి సెప్టెంబర్ 16( తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని గుండ్లపల్లి మండలంలో సీనియర్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగినది. మండలంలో ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వారి యొక్క సేవలకు గుర్తింపుగా మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగినది. ఉత్తమ ఉపాధ్యాయులుగా బ్రహ్మచారి గెజిటెడ్ హెచ్ఎం , నారాయణ రెడ్డి టీజీ ఎంఎస్ ప్రిన్సిపల్ , సరోజ, దివ్యశ్రీ , కవిత , ఈశ్వరమ్మ , విజయలక్ష్మి, ఆవుల మధుగారు , సంతోషి , వరలక్ష్మి , సుజాత , వెంకటేష్ , కృష్ణవేణి , రాము నాయక్ ని ఘనంగా సన్మానించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాధికారి పగిడిపాటి నర్సింహ మరియు ఎంపీవో జంగయ్య మరియు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గీతాంజలి మరియు శ్రీను, మండలంలోని ఉపాధ్యాయ సంఘం బాధ్యులు మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొనడం జరిగినది.

## ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అనుగుణంగా నూతన కోర్సులు



**భువనగిరి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేఖరి)**
: విద్యార్థుల్లో నైపుణ్యాలు, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన కోర్సులను ప్రవేశపెడుతోందని ఎడ్యుకేషన్ ఎక్స్‌టెన్షన్ సెంటర్ నోడల్ అధికారి డాక్టర్ బి. ధర్మ నాయక్ తెలిపారు. భువనగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి కళాశాల అధ్యయన కేంద్రంలో కౌన్సిలర్ల సమావేశంలో విద్యా, ఉపాధి అవకాశాల గోడపత్రికను ఆవిష్కరించారు. 2026--27 విద్యా సంవత్సరానికి యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని, సెప్టెంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహిళా విద్యార్థులకు వీ-హబ్‌తో కలిసి వ్యాపార నైపుణ్య శిక్షణ, గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక ఆధారిత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్ , కో-ఆర్డినేటర్ డాక్టర్ రమేశ్ గంజి, జాట్కో బొజ్జ బాలయ్య, అధ్యయన కేంద్ర కౌన్సిలర్లు డాక్టర్ బోడ జగన్నాథ్, పన్నాల బాల్ రెడ్డి, ఎన్. సుధ, కనక బాల రాజు, పాండురంగం, ఆసిఫ్ అలీ, లింగ మూర్తి, అతర్ ఫరీన్, రత్నపురం బాలరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## భవిష్యత్తును అంచనా వేస్తూ, సుస్థిరత సాధించండి

**ఆతిథ్య ఉపన్యాసంలో గీతం విద్యార్థులకు డాక్టర్ బొబ్బా ఉద్బోధ**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 16, (తెలంగాణ వాణి):**
బ్యాటరీ అధునాతన సాంకేతికతలపై పట్టు సాధించాలని, మరీ ముఖ్యంగా ఇంటెలిజెంట్ బ్యాటరీ పరిజ్ఞానం ద్వారా వర్తమానాన్ని తెలుసుకుంటూ, భవిష్యత్తును అంచనా వేస్తూ, సుస్థిరమైన రేపటిని సాధ్యం చేసుకోవాలని స్మార్ట్ ఎకో ఎలక్ట్రిక్ డ్రైవ్స్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ డాక్టర్ ఫణీంద్రబాబు బొబ్బా సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్, ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'బ్యాటరీ ఆరోగ్య పర్యవేక్షణ, పునర్ వినియోగంలో ఏఐ, ఎంఎల్ వినియోగం' అనే అంశంపై బుధవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. డాక్టర్ బొబ్బా, బ్యాటరీ ఆరోగ్య పర్యవేక్షణ (బీహెచ్ఎం), ఆరోగ్య స్థితి (ఎస్ఓహెచ్), మిగిలిన ఉపయోగకర జీవితం (ఆర్.యూఎల్), ముందస్తు నిర్వహణ, బ్యాటరీ పునర్వినియోగం, మరోసారి వినియోగించడం వంటి వాటిపై దృష్టి సారిస్తూ, ఎలక్ట్రిక్ వాహనాలు, శక్తి-నిల్వ వ్యవస్థలలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) యొక్క పెరుగుతున్న పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. వోల్టేజ్, కరెంట్, ఉష్ణోగ్రత, ఛార్జ్-డిశ్చార్జ్ సరళి వంటి బ్యాటరీ పారామితుల యొక్క ఏఐ/ఎంఎల్-ఆధారిత విశ్లేషణ, బ్యాటరీ ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి, క్షీణత, వైఫల్యాలను ముందుగా ఊహించడానికి భద్రతను పెంచడానికి, బ్యాటరీ జీవితకాలాన్ని పొడిగించడానికి ఎలా సహాయపడుతుందో



డాక్టర్ బొబ్బా వివరించారు. ఏఐ-ఆధారిత బ్యాటరీ గుర్తింపు, వర్గీకరణ, పదార్థాల పునరుద్ధరణ, పునర్ వినియోగం గురించి కూడా ఆయన చర్చించారు. వలయాకార, సుస్థిర బ్యాటరీ ఆర్థిక వ్యవస్థను నిర్మించడంలో వాటి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. విద్యార్థులకు ఆచరణాత్మక అవగాహన కల్పించడానికి కేస్ స్టడీలతో పాటు ఆయన చేసిన పరిశోధన ప్రచురణలను కూడా చూపారు. విద్యార్థుల ప్రశ్నలకు బదులిస్తూ, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ప్రశాంత ఆర్. ముడిమేల సమక్షంలో గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, డాక్టర్ బొబ్బాను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఈఈసీఈ విభాగానికి చెందిన డాక్టర్ జి. శ్రీనివాస్, డాక్టర్ పి.వి. రామకృష్ణ సమన్వయం చేశారు.



## గ్యాస్ అధిక ధరల వసూళ్లపై వినియోగదారుల ఆగ్రహం

**కంగ్టి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తడ్కల్ గ్రామంలో భారత్ గ్యాస్ సిలిండర్లకు నిర్ణయించిన ధర కంటే అదనంగా రూ.50--70 వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపించారు. బిల్లులో ఒక ధర చూపిస్తూ, డెలివరీ సమయంలో అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని, ప్రశ్నిస్తే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. సిలిండర్ల తూకంపైనా అనుమానాలు ఉన్నాయని తెలిపారు.అధికారులు గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసి అధిక వసూళ్లపై చర్యలు తీసుకోవాలని, ధరలను స్పష్టంగా ప్రదర్శించాలని, వినియోగదారుల ఫిర్యాదులపై స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ భగవాన్ సమీర్, రెడ్డి మహేష్, రాము, గోపాల్, గణపతి, వినియోగదారులు పాల్గొన్నారు.

## పురోహితుడి మృతికి కారణం అయిన వారిని శిక్షించాలి

**పెద్ద శంకరం పేట, సెప్టెంబర్ 16, (తెలంగాణ వాణి)**



నల్గొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం చింతల పాలెం గ్రామం లో పురోహితుడు దత్తు ప్రసాద్ శర్మ మృతికి కారణం అయిన వారిని శిక్షించాలని రాష్ట్ర అర్చక సంఘం ఉపాధ్యక్షులు గుడి చంద్ర శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతల పాలెం పురోహితులు దత్త ప్రసాద్ శర్మ వినాయక చవితి సందర్భంగా పూజలు చేయడానికి ఒక మండపం వద్దకు వెళ్లగా వారు సిద్ధంగా లేకపోవడం తో, మరో మండపం వద్దకు వెళ్లాడని దీంతో మొదటగా మా మండపం వద్ద పూజలు నిర్వహించాలని మొదటి మండపం నిర్వాహకులు అక్కడికి వెళ్ళి గొడవ పెట్టుకున్నట్లు తెలిపారు. దీంతో దత్తు ప్రసాద్ శర్మ కు హార్ట్ ఎటాక్ రావడం తో మృతి చెందాడని అతని మృతి కి కారణం ఆయన వారిని శిక్షించాలని గుడి.చంద్ర శేఖర్ పంతులు ఒక ప్రకటన లో ప్రభుత్వాన్ని కోరారు.

## రండి, ప్రతిభను చాటి స్ఫూర్తినివ్వండి

### గీతంలో బోధనేతర సిబ్బంది సాంస్కృతిక ఉత్సవం



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి)**
: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ ప్రాంగణంలో ఎన్‌టీఎస్ సాంస్కృతిక ఉత్సవం--2026ను బుధవారం నిర్వహించారు. సీఏఐఏ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు ప్రారంభించారు. బోధనేతర సిబ్బంది తమలోని ప్రతిభ, సృజనాత్మకతను ప్రదర్శించడంతో పాటు పరస్పర సహకారం, స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.



## బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శిగా నరేందర్ చారి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



బీజేపీ కిసాన్ మోర్చా సంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కంగ్టి మండలానికి చెందిన రైతు నాయకుడు నరేందర్ చారిని నియమించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నరేందర్ చారి తెలిపారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తూ కిసాన్ మోర్చాను గ్రామస్థాయిలో బలోపేతం చేస్తానన్నారు. తనకు బాధ్యత అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నరేందర్ చారి నియామకంపై కంగ్టి, నారాయణఖేడ్, కల్హేర్ మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## మోదీ జన్మదినం సందర్భంగా ప్రతి ఇంటా దీపం వెలిగించాలి



**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17న సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలని సంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ పిలుపునిచ్చారు. పెద్ద శంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోదీ జన్మదినం సందర్భంగా నెల రోజుల పాటు సేవా సంకల్ప్ అభియాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పత్రి రామకృష్ణ, నారాయణఖేడ్ పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ, టెంకటీ వార్డు సభ్యుడు వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
తాగునీరు, విద్యుత్, పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గస్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రూ.345 కోట్లతో నిర్మిస్తున్న క్యూర్ అర్బన్ రీజియన్ పాంశాలల పనులను వేగవంతం చేయాలని, ప్రారంభించని అభివృద్ధి పనుల కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని అవసరమైతే బ్లాక్‌లిస్టులో పెట్టాలని సూచించారు. అక్టోబర్‌లో పోచారం, లకడారం సబ్‌స్టేషన్లు, నందిగామ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**



ముత్తంగి శివారులోని ఓఆర్ఆర్ బ్రిడ్జి కింద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు దాటుతున్న సుమారు 30--35 ఏళ్ల వ్యక్తిని పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న టీజీ ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, బుధవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, సమాచారం ఉన్న వారు పటాన్‌చెరు పోలీసులను 8712661839, 944568141 నంబర్లలో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.



## మొక్కలు నాటిన మున్సిపల్ చైర్మన్

**జమ్మికుంట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు ఓదెలు కుమార్, గణేష్, రాజేందర్, రవీందర్‌తో పాటు ఎన్ఎస్ఎస్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు

## ఆరోగ్యం పరిశుభ్రత పై అవగాహన కలిగి ఉండాలి



**ధర్మారం, సెప్టెంబర్ 16(తెలంగాణ వాణి )**
సంపూర్ణ పోషణ ఆరోగ్యకరమైన కుటుంబంలో భాగంగా బుధవారం బొమ్మ రెడ్డిపల్లి అంగన్వాడి పూర్వ ప్రాథమిక పాఠశాలలో పోషణ్ అభియాన్ పోషణ మాసం కార్యక్రమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ కే బ్లాండిన హాజరై మాట్లాడారు.. సమతుల్య ఆహారం చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. తల్లులు గర్భిణీలు బాలింతల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్యన్ని పాటించాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈరోజు పుట్టిన రోజు ఉన్న పిల్లలకు వేడుకలు చేసి అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధార రాజకుమార్, ఉప సర్పంచ్ సంకరి నర్సింగం, నాయకులు సింగిరెడ్డి సుధాకర్ రెడ్డి, ధర్మారం సెక్టార్ లోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో నిహారికకు గోల్డ్ మెడల్




**పెద్దపల్లి, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
: హైదరాబాద్ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ బీఎస్ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే ఛాంపియన్‌షిప్--2026లో గాయత్రి జూనియర్ కళాశాల ఏసీఈ గ్రూప్ విద్యార్థిని వెలుతురు నిహారిక గోల్డ్ మెడల్ సాధించింది. ఈ విజయంతో అక్టోబర్‌లో జరిగే జాతీయ స్థాయి కరాటే పోటీలకు నిహారిక ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం నిహారికను అభినందించి, జాతీయ స్థాయిలోనూ రాణించి జిల్లాకు, కళాశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించింది.

## అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం



**రాజపేట, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి విలేకరి):**
గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. అన్నప్రసాద దాతలు గద్దె బాల నర్సయ్య, సిద్దమ్మ కాగా, ఎస్సై తకియోద్దీన్ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచ్, ఉపసర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్, షూస్ పంపిణీ



**శంకరపట్నం, సెప్టెంబర్ 16 (తెలంగాణ వాణి):**
మండలంలోని ఆముదాలపల్లి, చింతగుట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం యూనిఫామ్, షూస్ పంపిణీ చేశారు. ఆముదాలపల్లిలో సర్పంచ్ తాళ్లపెల్లి పరుశురాములు, ఉపసర్పంచ్ దొంగల రమేష్, చింతగుట్టలో సర్పంచ్ కర్నాట చంద్రశేఖర్‌రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్, షూస్ అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూస్‌తో పాటు నాణ్యమైన విద్య, పోషకాహారం అందిస్తున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రీలో ప్రతిభ ఉంటే సరిపోదు..



'మీర్జాపూర్' వెబ్ సిరీస్‌లో 'బీనా త్రిపాఠి' పాత్రతో దేశవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్, పాపులారిటీ సంపాదించుకున్న టాలెంటెడ్ నటి రసిక దుగల్. ఆ తర్వాత పలు వైవిధ్యమైన చిత్రాలు, సిరీస్‌లలో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొని సినిమా పరిశ్రమకు సంబంధించి కొన్ని షాకింగ్ విషయాలు బయటపెట్టింది. ఇండస్ట్రీలో కెరీర్ పరంగా తాను ఎదుర్కొన్న అనుభవాలను, వాస్తవాలను ఆమె పంచుకున్నారు. జీవితంలో, అలాగే సినిమా రంగంలో కొన్నిసార్లు నటుడి ప్రతిభ కంటే వ్యాపారపరమైన కోణాలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని రసిక దుగల్ అభిప్రాయపడ్డారు. మరికొన్ని సందర్భాల్లో ఎంతటి కళాత్మక ప్రతిభ ఉన్నప్పటికీ, అది సరిపోక పోవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఒక నటుడు చేసే పని, అనుభవం పెరుగుతున్న కొద్దీ ప్రేక్షకులు, దర్శకనిర్మాతల లో ఆ నటుడిపై ఒక నమ్మకం ఏర్పడుతుందని చెప్పారు. అయితే, ఆ నటుడు తాము అనుకున్న ప్రాజెక్ట్‌కు పూర్తిగా సరిపోతాడని మేకర్స్ భావించినప్పుడే అసలైన కాస్టింగ్ జరుగుతుందని తెలిపారు. ఒకవేళ ఆ పాత్రకు తను సరిపోనని వారు భావిస్తే ఎంతటి టాలెంటెడ్ నటిరైనా సరే అవకాశాలు ఇవ్వరని రసిక వెల్లడించారు. ఎంత మంచి గుర్తింపు, పాపులారిటీ ఉ న్న నటీనటులకు సైతం కొన్నిసార్లు మంచి అవకాశాలు చేజారిపోతుం టాయని, అది చూసినప్పుడు ఎంతో బాధ కలుగుతుందని ఆమె తన మనసులోని ఆవేదనను పంచుకు న్నారు. గ్లామర్ ప్రపంచం వెనుక ఉ ండే అసలు నిజాలను, కాస్టింగ్ వెను క జరిగే చీకటి కోణాలను రసిక దుగ ల్ చాలా స్పష్టంగా చెప్పడంతో ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియా లో హాట్ టాపిక్‌గా మారాయి.

## 'మండాడి' మేనియా.. 5 రోజుల్లో రూ.65 కోట్లు..




తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో విడుదలైన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'మండాడి' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో టాలెంటెడ్ డైరెక్టర్ మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన ఈ చిత్రం, విడుదలై కేవలం ఐదు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.65 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. బోట్ రేసింగ్ నేపథ్యంతో సాగే వినూత్న కథాంశం, అద్భుతమైన యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకులను థియేటర్లకు క్యూ కట్టేలా చేస్తున్నాయి.

అయితే ఈ సినిమా కమర్షియల్ విజయంతో పాటు, దీని డిజిటల్ స్ట్రీమింగ్ రైట్స్‌కు సంబంధించిన న్యూస్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. రూ.45 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ డిజిటల్ హక్కులను సొంతం చేసుకుంది. అయితే, ఈ డీల్ వెనుక ఒక ఆసక్తికరమైన బాక్సాఫీస్ లింక్ ఒప్పందం ఉన్నట్లు తెలుస్తోంది. మొదట నిర్మాత ఎల్రెడ్ కుమార్ రూ.25 కోట్లు డిమాండ్ చేయగా, నెట్‌ఫ్లిక్స్ రూ.15 కోట్లు మాత్రమే ఇవ్వడానికి ముందుకొచ్చింది.

దీంతో ఇరువర్గాల మధ్య ఒక వినూత్న షరతుతో కూడిన ఒప్పందం కుదిరింది. సినిమా వసూళ్ల ఆధారంగా పారితోషికం పెరిగేలా ప్లాన్ చేశారు. బాక్సాఫీస్ వద్ద సినిమా రూ.50 కోట్లు దాటితే రూ.30 కోట్లు, అలాగే రూ.60 కోట్ల నుంచి రూ.80 కోట్ల మధ్య వసూలు చేస్తే ఏకంగా రూ.40 కోట్లు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. ప్రస్తుతం ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.65 కోట్ల మార్క్‌ను అందుకోవడంతో, నెట్‌ఫ్లిక్స్ రూ.40 కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెట్టిన బడ్జెట్‌లో సగానికి పైగా కేవలం ఓటీటీ హక్కుల ద్వారానే వెనక్కి వస్తుండటంతో నిర్మాతకు ఇది అసలు సిసలు జాక్‌పాట్ అని చెప్పవచ్చు. ఇదే జోరు కొనసాగితే 'మండాడి' త్వరలోనే వంద కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది.

## 'డీజే టిల్లు' దర్శకుడి కొత్త చిత్రం..

### ఆకట్టుకుంటున్న 'అనుమాన పక్షి' ట్రైలర్!




యువతను విపరీతంగా ఆకట్టుకుని బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన 'డీజే టిల్లు' చిత్ర దర్శకుడు విమల్ కృష్ణ ఇప్పుడు మరో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. టాలెంటెడ్ హీరో రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'అనుమాన పక్షి'. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినిమాపై అంచనాలను విపరీతంగా పెంచేసింది. ట్రైలర్‌ను గమనిస్తే.. హీరో పాత్రలోని 'అనుమానం' అనే బలహీనత చుట్టూ కథ ఎంతో ఆసక్తికరంగా, నవ్వులు తెప్పించేలా నడుస్తుందని స్పష్టమవుతోంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే వ్యక్తిగా రాగ్ మయూర్ అద్భుతమైన హావభావాలతో కడుపుబ్బా నవ్విస్తున్నారు. కేవలం కామెడీ మాత్రమే కాకుండా ఇందులో మంచి క్రైమ్ థ్రిల్లర్ మరియు డార్క్ కామెడీ ఎలిమెంట్స్ కూడా జోడించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా, శ్రీచరణ్ పాకాల అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. వైవిధ్యమైన కథాకథనాలతో వస్తున్న ఈ 'అనుమాన పక్షి' సినిమా సెప్టెంబర్ 18న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. డీజే టిల్లు లాంటి మాస్ ఎంటర్‌టైనర్ తర్వాత విమల్ కృష్ణ ఈసారి ఎలాంటి వినోదాన్ని పంచబోతున్నారోనని సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

### అమెజాన్ ప్రైమ్‌లో దూసుకుపోతున్న

## 'హుషార్ పిట్టలు'..



సినిమా పరిశ్రమలో చిన్న చిత్రంగా విడుదలై, బాక్సాఫీస్ వద్ద భారీ ప్రభంజనం సృష్టించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషార్ పిట్టలు'. ఇప్పుడు ఈ సినిమా డిజిటల్ రంగంలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. థియేటర్లలో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుని బ్లాక్‌బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న ఈ చిత్రం, ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో అధికారికంగా స్ట్రీమింగ్ ప్రారంభించుకుంది. థియేటర్లలో ఈ సినిమాను చూడలేకపోయిన సినీ ప్రియులు, ప్రస్తుతం ఓటీటీలో చూసేందుకు అమితాసక్తి కనబరుస్తున్నారు.

కేవలం యూత్‌ను మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను, కుటుంబాలను ఆకట్టుకునేలా అద్భుతమైన భావోద్వేగాలు, వినోదాత్మక అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అన్ను మరియు వాసవి గణేషన్ జంటగా నటించిన ఈ సినిమాలో ప్రతి ఒక్కరూ రిలేట్ చేసుకునేలా రియలిస్టిక్ సన్నివేశాలు ఉంటాయని చిత్ర యూనిట్ తెలిపింది. రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించగా, పద్మ అమ్మ మరియు బీవీజీ స్టూడియోస్ సహకారంతో ఇది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. వినూత్న కథాకథనాలతో ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహించగా, సురేష్ ఏషియన్ ఫిలింస్ సంస్థ దీనిని థియేటర్లలో ఘనంగా విడుదల చేసింది.

థియేటర్లలో ప్రేక్షకులే స్వయంగా ప్రచారకర్తలుగా మారి ఈ సినిమాను పెద్ద హిట్ చేశారని, ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్‌కు ఈ చిత్రం మరింత చేరువవుతోందని చిత్ర నిర్మాత ఆశాభావం వ్యక్తం చేశారు. వీకెండ్‌లో మంచి టైమ్ పాస్ కోసం చూస్తున్న మూవీ లవర్స్‌కు 'హుషార్ పిట్టలు' ఒక చక్కటి ఎంపిక అని చెప్పవచ్చు.



## 'డేవిడ్ రెడ్డి' చిత్రంలో కమలారెడ్డిగా రమ్యకృష్ణ.. ఫస్ట్ లుక్ విడుదల!

మంచు మనోజ్ హీరోగా వస్తున్న భారీ యాక్షన్ డ్రామా చిత్రం 'డేవిడ్ రెడ్డి'. ఈ చిత్రంలో ప్రముఖ నటి రమ్యకృష్ణ అత్యంత శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె కమలారెడ్డి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. 'బాహుబలి' శివగామి తరహాలోనే మరోసారి రమ్యకృష్ణ కమలారెడ్డి పాత్రలో చాలా పవర్‌ఫుల్‌గా, ఫీర్స్‌గా కనిపించబోతున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రమ్యకృష్ణ బర్త్‌డే సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఆమె పాత్ర సినిమాకే ఒక ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో మరియా రియాబోషాప్కా హీరోయిన్‌గా నటిస్తుండగా, సముద్రఖని, అభయ్ డియోల్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది.

## 'పవర్ హౌస్' టైటిల్ అనౌన్స్‌మెంట్

కోలీవుడ్ స్టార్ హీరో చీయన్ విక్రమ్ నటిస్తున్న తాజా చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. వినాయక చవితి కానుకగా మేకర్స్ ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. విక్రమ్ కెరీర్‌లో 63వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి 'పవర్ హౌస్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఇరు ముగన్' వంటి సక్సెస్ ఫుల్ సినిమా తర్వాత విక్రమ్, దర్శకుడు ఆనంద్ శంకర్ కాంబినేషన్‌లో



వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ హైప్ ఏర్పడింది. విడుదలైన టైటిల్ ప్రోమో చాలా ఆసక్తికరంగా సాగింది. ఇందులో విక్రమ్ ఒక సాధారణ వెడ్డింగ్ క్యాటరర్‌గా తన కుటుంబంతో సరదాగా కనిపిస్తూనే, మరోవైపు తనలోని డార్క్ అండ్ వయొలెంట్ షేడ్‌ను చూపించి ఆకట్టుకున్నారు. స్టోరేజ్ రూమ్‌లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడి కట్టేసి ఉండడం ఈ టీజర్‌లోని ప్రధాన హైలైట్‌గా నిలిచింది.

ఈ చిత్రంలో ఊర్వశి, విటీవీ గణేష్, రియా షిబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తుండగా, సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు. ఈ టైటిల్ ప్రోమోను బట్టి సినిమాను 2027లో థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. త్వరలోనే తెలుగు వెర్షన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా రానున్నాయి.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com